
RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:67 9-10-2025 గురువారం ఎడిటర్ :మద్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /




## రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ పురస్కారం

(టుడే విదుర): రసాయనశాస్త్రంలో మెటల్–ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్‌లో పరిశోధనలకు గాను ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ పురస్కారం వరించింది. సుసుము కిటగావా, రిచర్డ్ రాబ్సన్ మరియు ఒమర్ ఎం.యాఘికి నోబెల్ బహుమతిని ప్రదానం చేస్తున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బుధవారం ప్రకటించింది. నోబెల్ బహుమతి గ్రహీతలు వాయువులు, ఇతర రసాయనాలు ప్రవహించే అతిపెద్ద ఖాళీలతో పరమాణు నిర్మాణాలను సృష్టించారు. ఈ మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ ఎడారిగాలి నుండి నీటిని సేకరించడానికి, కార్బన్‌డయాక్సైడ్‌ను సంగ్రహించడానికి, విషవాయువులను నిల్వ చేయడానికి లేదా రసాయన ప్రతిచర్యలను ఉత్ప్రేరకరించేందుకు వినియోగించవచ్చు.

## బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు

# ఏడుగురు మృతి



మండపేట (టుడే విదుర) : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి ఏడుగురు మృతి చెందిన దుర్ఘటన బుధవారం జరిగింది. మండపేట నియోజకవర్గం రాయవరంలో ఉన్న గణపతి ఫైర్ వర్క్స్ బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘోర ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. మరికొందరికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రాయవరం బాణసంచా కేంద్రం పేలుడు ఘటన కలచివేసింది: సీఎం చంద్రబాబు



- కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా కేంద్రంలో ఘోర అగ్నిప్రమాదం
- ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు
- సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో ఫోన్‌లో సమీక్ష
- వెంటనే ఘటనా స్థలానికి వెళ్లాలని అధికారులకు ఆదేశం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచన
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి భరోసా

2లో


## పెట్టుబడులకు ఇదే మంచి సమయం: మోదీ



(టుడే విదుర): ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'మేక్ ఇన్ ఇండియా'పై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. మొబైల్‌ఫోన్లు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో అపార అవకాశాలున్నాయని చెప్పారు. పెట్టుబడులకు భారత్ అత్యుత్తమ గమ్యమని పేర్కొన్నారు. భారత్ రెండో అతిపెద్ద 5జీ మార్కెట్‌గా ఎదిగిందని, బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ సేవలు ప్రారంభించడం దేశ గౌరవమని మోదీ అన్నారు.


# రూ.1.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్

అమరావతి, (టుడే విదుర):11వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ. 1.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోద ముద్ర పడింది. ఈరోజు (బుధవారం) ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పాల్గొన్నారు. మూడు 3 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఎస్ఐపీబీ సమావేశంలో ప్రాజెక్టుల వారీగా లోతైన చర్చ జరిగింది. భారీ ప్రాజెక్టులకు ప్రత్యేక అధికారుల నియామకానికి ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కంపెనీలు త్వరగా గ్రౌండ్ అయ్యేలా ప్రత్యేక అధికారులు బాధ్యత తీసుకోనున్నారు.ఐటీ, ఇంధనం, టూరిజం, ఎరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో 30కిపైగా ప్రాజెక్టులకు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. వీటి ద్వారా 67 వేల ఉద్యోగాలు వస్తాయని అంచనా. దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి 11వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. రూ.87,520 కోట్లు పెట్టుబడి పెట్టనున్న రైడెన్ ఇన్ఫో టెక్ డేటా సెంటర్‌కు కు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో ఎఫ్‌డీఐ రాలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రైడెన్ ఇన్ఫో టెక్ డేటా సెంటర్ ఏర్పాటు కొత్త చరిత్రను లిఖిస్తుందని ఎస్ఐపీబీ సమావేశం పేర్కొంది.ఇక.. అతిపెద్ద ఫారిన్ ఇన్వెస్టిమెంట్ సాధించడంపై ఐటీ మంత్రి నారా లోకేష్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు అభినందనలు తెలియజేశారు. 15 నెలల కాలంలో పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకు జరిగిన 11 ఎస్ఐపీబీల ద్వారా రూ. 7.07 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. దీని ద్వారా 6.20 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.



## ఏపీలో రోడ్ల మరమ్మతులకు భారీగా నిధుల విడుదల

- ఏపీలో రోడ్ల మరమ్మతుల కోసం రూ.1,000 కోట్లు
- పాలనాపరమైన అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం
- రాష్ట్రవ్యాప్తంగా 274 రహదారులకు మరమ్మతులు
- రాష్ట్ర రహదారులకు రూ.400 కోట్లు కేటాయింపు
- జిల్లా రహదారుల కోసం మరో రూ.600 కోట్లు



(టుడే విదుర): ఆంధ్రప్రదేశ్‌లో రహదారుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుల కోసం ఏకంగా రూ.1,000 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు నిధులకు పాలనాపరమైన అనుమతులు ఇస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో రాష్ట్రంలోని మొత్తం 274 రహదారులను బాగుచే యనున్నారు. మంజూరైన నిధులను రాష్ట్ర, జిల్లా రహదారుల పనులకు వేర్వేరుగా కేటాయించారు. ఇందులో భాగంగా, రాష్ట్ర రహదారుల (స్టేట్ హైవేస్) పరిధిలోని 108 పనుల కోసం రూ.400 కోట్లు కేటాయించారు. అదేవిధంగా, వివిధ జిల్లాల్లోని ముఖ్యమైన 166 రహదారుల మరమ్మతుల కోసం రూ.600 కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

## ఆ దగ్గు మందులపై నిషేధం

## తెలంగాణ సర్కార్ ఆదేశాలు

తెలంగాణ, (టుడే విదుర): రీలైఫ్, రెస్పిఫ్రెష్–టీఆర్ దగ్గు మందులను నిషేధిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. ఈ రెండు దగ్గు మందుల్లోనూ కల్తీ జరిగినట్లు అధికారులు గుర్తించారు. చిన్నారులలో తీవ్రమైన రోగాలను, మరణాలను కలిగిస్తున్న ప్రమాదకర దగ్గు మందులను రాష్ట్ర ప్రభుత్వం నిషేధిస్తూ చర్య తీసుకుంది. రీలైఫ్, రెస్పిఫ్రెష్–టీఆర్ అనే రెండు సిరప్‌లను విక్రయించకూడదు అని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో కోల్డ్‌రిఫ్ సిరప్ కారణంగా 16 చిన్నారుల మరణాలు చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. డాక్టర్ల పర్యవేక్షణ లేకుండా ఎడపెడా పిల్లలకు దగ్గు, జలుబు సిరప్‌లు ఇవ్వకూడదని అధికారిక సూచనలు కూడా జారీ అయ్యాయి. కాంచీపురం లోని తయారు చేసిన కోల్డ్‌రిఫ్ సిరప్‌పై ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ తనిఖీలు నిర్వహించింది. ఈ సిరప్‌ను తక్షణం తెలంగాణలో విక్రయించకూడదు అని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని అన్ని హాస్పిటళ్లు, ఫార్మసీలు ఈ నిషేధాన్ని వెంటనే అమలు చేయాల్సినట్లు సూచించబడింది.

## క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి: మంత్రి లోకేష్



అమరావతి,(టుడే విదుర): కోనసీమ జిల్లాలో బాణసంచా తయారీ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంపై మంత్రి లోకేష్ స్పందించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనలో ఆరుగురు వ్యక్తులు దుర్మరణం పాలవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మంటల్లో చిక్కుకుని కార్మికులు సజీవ దహనం కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై ప్రభుత్వం ఇప్పటికే ఆరా తీసిందని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి లోకేష్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మాజీ సీఎం జగన్‌పై కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఫైర్..



అమరావతి, (టుడే విదుర):మాజీ సీఎం జగన్‌కు గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా.. సిగ్గు లేకుండా పీపీపీపై అబద్ధాలు చెబుతున్నారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగనే 16 మెడికల్ హబ్‌లకు పీపీపీ టెండర్లు పిలిచారని గుర్తుచేశారు. ఇప్పుడు తానే వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. జె టాక్స్‌కు భయపడి టెండర్లకు ఎవరూ రాలేదని విమర్శించారు. ఇప్పుడు పీ–4 పథకం విజయవంతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు సీఎం చంద్రబాబు మీద నమ్మకం ఉంచారని అన్నారు.

## పీ ప్రజలకు అలర్ట్..

## మరోసారి భారీ వర్షాలు..

అమరావతి, (టుడే విదుర):బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావం వల్ల రాష్ట్రంలో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ వాతావరణ శాఖ హెచ్చరించింది. దక్షిణ చత్తీస్‌గఢ్ నుంచి మన్నార్ గల్ఫ్ వరకు.. తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు ప్రాంతాల మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్లు ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఏండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు.ద్రోణి ప్రభావంతో ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో రెండు రోజులపాటు పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. ప్రజలు చెట్ల క్రింద నిలబడరాదని, అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అలాగే ఇవాళ పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసినట్లు తెలిపారు. తిరుపతి జిల్లా దక్కిలిలో 77.2మిమీ, అల్లూరి జిల్లా అరకులో 61మిమీ, నెల్లూరు జిల్లా దగదర్తిలో 57.7మిమీ, బాపట్ల జిల్లా రామకూరులో 56.5మిమీ, అనకాపల్లి జిల్లా పాములవాకలో 48.5మిమీ, కడప జిల్లా పులివెందులలో 45.5మిమీ వర్షపాతం నమోదైందని ఆయన పేర్కొన్నారు.

# సంపాదకీయం

## జాతి సంస్కారానికి భావోద్వేగాల కళంకం

కొన్ని సంఘటనలు యాధృచ్ఛికంగా జరగవు. అదే సమయంలో ఫలానా సంఘటన వెనుక కొన్ని ప్రేరేపిత శక్తులున్నాయని కూడా చెప్పడం సరైనది కాదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఒక న్యాయవాది బూటు విసిరేందుకు ప్రయత్నించిన సంఘటనకు కూడా ఇదే వర్తిస్తుంది. భారత దేశంలో ఎలాంటి భావోద్వేగ పరిస్థితులు నెలకొన్నాయో, ప్రజలు ఏ మనోభావాలకు ప్రేరితులవుతున్నారో చెప్పేందుకు ఇది ఉదాహరణ. అంతే కాదు, మీడియా ఒక వ్యాఖ్యను సమగ్రంగా ప్రసారం చేసేందుకు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఏం జరుగుతుందో కూడా ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి.%విషయాన్ని సమగ్రంగా అర్థం చేసుకోలేనప్పుడు, దేశంలో ఉన్న ప్రజాస్వామిక సంస్కృతి, దాని చరిత్ర గురించి అవగాహన లేనప్పుడు, భారత రాజ్యాంగం స్ఫూర్తిని జీర్ణించుకోలేనప్పుడు ఇలాంటి సంఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉన్నది. కొన్ని వందల సంవత్సరాల పాటు అనేక శక్తులతో పోరాడిన తర్వాత దేశానికి ప్రజాస్వామిక వ్యవస్థ లభించింది. అనేక మంది మేధావులు చర్చించిన తర్వాత రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాం. రాజ్యాంగంలోని ప్రగతిశీల అంశాల ఆధారంగానే కాలం చెల్లిన దురాచారాల్ని, అన్యాయాల్ని అనేకం మనం వదుల్చుకోగలిగాం. నిజానికి మతాల్లోని దుర్మార్గాలను కూడా తొలగించుకుని కాలానికి తగ్గట్లుగా మార్చుకునేందుకు కూడా రాజ్యాంగ వ్యవస్థలే దోహదం చేశాయి. అందువల్లే మనం సంప్రదాయాల్ని పాటించినా ఆధునిక జీవన విధానాలను అనుసరిస్తున్నాం. నాయకులు రాజకీయ ప్రయోజనాలు ఆశించి కాలాన్ని వెనక్కి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తారు కానీ రాజ్యాంగం ప్రగతిశీలంగానే ఉంటుంది. అంతే కాదు, ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైనప్పటికీ అనేక దేశాల మాదిరి మన దేశంలో అల్లకల్లోలాలు, అస్థిరత ఏర్పడలేదంటే ఇది కొన్ని వేల శతాబ్దాలుగా మనం రూపొందించుకున్న వ్యవస్థలు ఎప్పటికప్పుడూ మారుతూ పరిపక్వంగా రూపొందుతున్నాయనే అర్థం. మన సంప్రదాయం సహనాన్ని బోధిస్తుంది. మన తత్వశాస్త్రం సహనాన్ని బోధిస్తుంది. మన రాజ్యాంగం సహనాన్ని ఆచరిస్తుంది. దీన్ని పలుచన చేయవద్దు.. అని జస్టిస్ చిన్నప్పరెడ్డి అన్నారు. ఎందుకో కానీ దేశంలో అసహనం విపరీతంగా పెరిగిపోతున్నదని కొన్ని సంఘటనలు నిరూపిస్తున్నాయి.మన దేశానికి ప్రజాస్వామ్యం కొత్తది కాదని, బుద్ధుడి కాలంలోనే సంఘాలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానాలను పాటించాయని అంబేద్కర్ రాజ్యాంగ సభలో చెప్పారు. తమిళనాడులో కంజీవరం సమీపంలోని గ్రామాల్లో అనేక ఆలయాల గోడలపై బ్యాలెట్ బాక్స్, బ్యాలెట్ పేపర్ల గురించి ప్రస్తావన ఉన్నదని టంగుటూరి ప్రకాశం కూడా రాజ్యాంగ సభలో తెలిపారు. ఆధునిక ప్రజాస్వామ్య పద్ధతులు దేశానికి కొత్త కాదని అన్నారు. నిజానికి జనసంఘ్ సిద్ధాంతకర్త దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రజాస్వామ్యం సహజంగా ఇమిడిపోయినందువల్లే దేశం ఇంత సజావుగా నడుస్తోందని అభిప్రాయపడ్డారు. వేదిక్ సభలు, సమితిలు ప్రజాస్వామ్యయుతంగా జరిగేవని ఆయన చెప్పారు. దేశ సమైక్యతకు ప్రజాస్వామ్యం ఒక సమర్థమైన సాధనమని దీనదయాళ్ చెప్పారు. కాని ఈ ప్రజాస్వామిక స్ఫూర్తి రోజురోజుకూ తగ్గిపోతోందా?

జానికి జస్టిస్ గవాయ్ ఎక్కడా ఒక మతాన్ని విమర్శించినట్లు దాఖలాలు లేవు. మధ్యప్రదేశ్‌లో ఖజురాహో శిల్ప కళాఖండాలలో భాగమైన జవారీ ఆలయంలో ఏడు అడుగుల ఖండిత విష్ణుమూర్తి విగ్రహాన్ని పునరుద్ధరించాలని దాఖలైన పిటిషన్‌ను విచారిస్తూ ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలను పూర్తిగా ఉటంకించనందువల్లే ఈ వివాదం తలెత్తింది. ఈ విగ్రహాన్ని మళ్లీ యథాతథంగా పునర్నిర్మించి ప్రాణప్రతిష్ఠ చేయాలని రాకేశ్ దలాల్ అనే వ్యక్తి గత కొంతకాలంగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖకూ, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాకూ వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. నిరసన ప్రదర్శనలు కూడా నిర్వహించారు. చివరకు సుప్రీంకోర్టు తలుపు కూడా తట్టారు. 'ఇది ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిధిలోనిది. అలాంటిది ఆ సంస్థ అనుమతిస్తుందో లేదో తెలియదు. అందులో అనేక అంశాలు ఇమిడి ఉన్నాయి' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సెప్టెంబర్ 16న స్పష్టంగా చెప్పారు. అంతటితో ఊరుకోకుండా 'వెళ్లి మీ దేవుడినే ఏమైనా చేయమని అడగండి.. మీరు విష్ణుభగవానుడి పరమభక్తుడైతే ఆయననే ప్రార్థించి ధ్యానం చేయండి.. లేకపోతే ఖజురాహోలో అతి పెద్ద శివలింగం ఉన్నది కదా.. మీరు శైవమతానికి వ్యతిరేకం కాకపోతే అక్కడకు వెళ్లి ప్రార్థన చేయొచ్చు' అని సలహా ఇచ్చారు. గవాయ్ మనస్ఫూర్తిగానే ఈ సలహా ఇచ్చి ఉండవచ్చు. ఖజురాహో నిజానికి ఒక తత్వానికి కట్టుబడి ఉన్నది కాదు. అక్కడి శిల్పాల్లో వైష్ణవం, శైవంతో పాటు, జీవితంలో ఇమిడిపోయిన ప్రేమ, ప్రకృతి, కామం, స్వలింగ సంపర్కం, తంత్ర మొదలైనవన్నీ మిళితమై ఉంటాయి. మొత్తం భారతీయ జీవన విధానం, సంస్కృతి, స్వేచ్ఛలకు అది ప్రతిబింబం. దట్టమైన అడవుల్లో మునిగిపోయిన ఈ అమూల్యమైన శిల్పసంపద గురించి మనకు బ్రిటిష్ వారే తెలిపారు. మతపరమైన భావోద్వేగాల కంటే మన భారతీయ సంస్కృతిలోని ఔన్నత్యానికి మనం ప్రాధాన్యత నీయాల్సిన అవసరం ఉన్నది.

నిజానికి గవాయ్ వ్యాఖ్యలు సంచలనం కావాల్సిన అవసరం లేదు. కేసుల విచారణ సందర్భంగా న్యాయ మూర్తులు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూనే ఉంటారు. అయోధ్య కేసులో విచారణ జరుగుతున్నప్పుడు శ్రీరాముడు కచ్చితంగా ఎక్కడ పుట్టారో చెప్పగలరా? రఘువంశానికి చెందినవారెవరైనా అక్కడున్నారా? ఆ ప్రాంతానికి దైవత్వం ఎందుకు ఆపాదిస్తున్నారు? అన్న ప్రశ్నలు వేశారు కాని అప్పుడెవరూ న్యాయమూర్తులను నిందించలేదు. శబరిమల కేసులో సుప్రీంకోర్టు భక్తి శ్రద్ధల విషయంలో లింగవివక్ష కూడదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఎన్నో వాద వివాదాలు జరిగాయి. నాడు జస్టిస్ గొగోయ్, జస్టిస్ దీపక్ మిశ్రాలపై ఎవరూ దాడి చేయలేదు. కాని ఇప్పుడెందుకు గవాయ్‌పై దాడి జరిగింది? ఆయన దళితుడైనందుకా అన్న ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. జస్టిస్ గవాయ్ సాధారణ నేపథ్యం ఉన్న వ్యక్తి కాదు. ఆయన తండ్రి ఆర్‌ఎస్ గవాయ్ అంబేద్కర్‌తో పాటు బౌద్ధమతాన్ని స్వీకరించిన వేలాది మందిలో ఒకరు. జస్టిస్ గవాయ్ కూడా బౌద్ధమతస్థుడే. నిజానికి బుద్ధుడిని కూడా దశావతారాల్లో ఒకరిగా హిందూమతం స్వీకరించింది.జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలు చేసిన రోజునుంచే సోషల్ మీడియాలో ఆయనపై దాడులు మొదలయ్యాయి. నిజానికి ఆయన మాటల్ని ఎవరూ పూర్తిగా ఉటంకించలేదు. ప్రధాన న్యాయమూర్తి హిందూ మనోభావాలను దెబ్బతీశారని, సీజేఐ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఒక న్యాయవాది ఆయనకు లేఖ కూడా రాశారు.

మొదటి పేజీ తరువాయి

## రాయవరం బాణసంచా కేంద్రం పేలుడు ఘటన కలచివేసింది: సీఎం చంద్రబాబు

కోనసీమ జిల్లా రాయవరంలోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర సంఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు.ఈ ఘటన తెలిసిన వెంటనే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు ఆరా తీశానని చంద్రబాబు వెల్లడించారు. ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యల పురోగతిపై సమీక్షించినట్టు వివరించారు. సీనియర్ అధికారులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశానని తెలిపారు. కాగా, ఈ ప్రమాదంలో గాయపడిన వారికి సాధ్యమైనంత ఉత్తమమైన వైద్య సేవలు అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. బాధితుల వైద్యానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రాయవరంలోని గణపతి గ్రాండ్ బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

# ఆశపెట్టి.. 1.16 కోట్లు కొల్లగొట్టి..

## ట్రేడింగ్ యాప్‌లో అధిక ఆదాయం ఆశ చూపి సొమ్ము కాజేసిన కిలేడీ

కనిగిరి, అక్టోబర్8 (టుడే విదుర) ప్రకాశం జిల్లా కనిగిరిలోని ఓ వ్యాపారికి సోషల్ మీడియాలో ఓ మహిళ పరిచయమైంది. తాను ట్రేడింగ్ యాప్‌లో 'గోల్డ్‌బాక్స్' బిజినెస్ చేస్తానని, పెట్టిన పెట్టుబడికి మంచి ఆదాయం వస్తోందని నమ్మించింది. మీరూ చేస్తే రెట్టింపు ఆదాయం వస్తుందని ఆశపెట్టింది. ట్రయల్ కింద రూ.లక్ష పెడితే.. 2రోజులకే రూ.3 లక్షలు ఖాతాలో జమచేసింది. నిజమేనని నమ్మిన




ఆ వ్యాపారి విడతల వారీగా రూ.1.16 కోట్లు ఆమె చెప్పిన ఖాతాల్లో వేశారు. ఆ మొత్తం కొట్టేసిన ఆ మహిళ.. మాయమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరి వ్యాపారి అత్యాశకు పోయి మొదటిసారి రూ.లక్ష ఆ యువతి చెప్పిన అకౌంట్‌కు వేశారు. అవి రెండు రోజులకు రూ.3 లక్షలు అయ్యాయని చెప్పి.. ఆ మొత్తాన్ని తిరిగి వ్యాపారి అకౌంట్‌కు పంపించింది. నమ్మకం కుదరడంతో ఆ వ్యాపారి 45 రోజులుగా ఆమె చెప్పిన ఏడు ఖాతాల్లో రూ.1.16 కోట్ల వరకూ నగదు జమచేశాడు. ఆ తర్వాత ఆ యువతి సోషల్ మీడియా నుంచి మాయమైంది. మోసపోయినట్టు గమనించిన వ్యాపారి మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. మొదటి లావాదేవీ జరిగిన ఖాతాను సీజ్ చేశారు.

# సమస్యలు పరిష్కరించకుంటే మరో ఉద్యమం

**పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి**
**12వ పీఆర్సీ, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి**
**ఈనెల 10 నుంచి బోధనేతర విధుల బహిష్కరణ**
**'పోరుబాట' కార్యక్రమంలో ఫ్యాప్టో నేతల ప్రకటన**



విజయవాడ (ధర్నాచౌక్), అక్టోబర్8 (టుడే విదుర) ఈ నెల 10 నుంచి బోధనేతర విధులు, విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే మరో బీఆర్టీఎస్ రోడ్డు తరహా ఉద్యమాన్ని చేపడతామని ఫ్యాప్టో నేతలు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు గడుస్తున్నా.. నేటికీ టీచర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. నేటికీ 70 రకాల యాప్‌లలో సమాచారాన్ని అప్‌లోడ్ చేయాల్సి వస్తుందని వాపోయారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నాచౌక్‌లో చేపట్టిన 'పోరుబాట' కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యారంగంలో విపరీతంగా పెరిగిపోయిన యాప్‌లతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్సీ ప్రకటించాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేసేందుకు కార్యాచరణ ప్రకటించాలన్నారు. కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సానుకూలంగా ఉన్నప్పటికీ.. అధికారులు అలసత్వంగా ఉన్నారని ఆరోపించారు. సీపీఎస్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. టీచర్లను విద్య బోధించేందుకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వమిచ్చిన మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలని ఫ్యాప్టో చైర్మన్ డిమాండ్ చేశారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ చిరంజీవి మాట్లాడుతూ గిన్నిస్‌బుక్ రికార్డులు, యోగాంధ్ర కార్యక్రమాల కోసం ఉపాధ్యాయులను ఇబ్బందిపెట్టడం సరికాదన్నారు. ఏపీ ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విద్యాసాగర్, డి.వి.రమణ, ఎమ్మెల్సీ బి.గోపి మూర్తి, మాజీ ఎమ్మెల్సీలు కేఎస్.లక్ష్మణరావు, కత్తి నరసింహారావు 'పోరుబాట' కార్యక్రమంలో పాల్గొన్నారు.




# 104లో రక్త పరీక్షలెప్పుడు..

**జ్వరం, బీపీ, షుగర్ మందులకే పరిమితం**
**ప్రభుత్వ లక్ష్యానికి దూరంగా 104 వాహనాలు**
**'ఇంటి వద్దకే వైద్యసేవలు'కుగ్రహణం**

(అమరావతి – అక్టోబర్8 (టుడే విదుర):ఇంటి వద్దకే అన్నిరకాల వైద్య సేవలందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 104 వాహనాలను ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 904 వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి నిర్వహణకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. ఈ వాహనాలు రోజూ గ్రామాల్లోకి వెళ్లి.. ప్రజలకు వైద్య సేవలందించాలి. బీపీ, షుగర్, యూరిన్, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలతోపాటు కిడ్నీ, లివర్ ఫంక్షనింగ్... ఇలా 47 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలి. కానీ.. ఉదయాన్నే డ్రైవర్, డీఈవో (డేటా ఎంట్రీ ఆపరేటర్)తో కలిసి గ్రామాల్లోకి వెళ్తున్న 104 వాహనాలు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయడం లేదు. జ్వరానికి పారాసిటమాల్, వృద్ధులకు బీపీ, షుగర్ మందులు, గర్భిణులకు ఐరన్ ట్యాబ్లెట్లు ఇవ్వడానికి తప్ప ఈ వాహనాలు దేనికీ ఉపయోగపడడం లేదు.పరీక్షలు లేకుండానే మందులు...సీఎం చంద్రబాబు.. 104 వాహనాలను కేవలం మందులివ్వడానికే పరిమితం చేయకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన రక్తపరీక్షలు నిర్వహించేలా చూడాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కొత్తగా 104 వాహనాలను ప్రారంభించి ఐదు నెలలు పూర్తయింది. కానీ.. ఈ వాహనాలు గ్రామాల్లోకి వెళ్లి వృద్ధులు, గర్భిణులకు మందులిచ్చి రావడం తప్ప రక్తపరీక్షల ఊసే ఎత్తడం లేదు. పీహెచ్‌సీ డాక్టర్.. గర్భిణులకు కొన్ని సూచనలు ఇవ్వడం తప్ప వైద్య పరీక్షలు నిర్వహించడం లేదు. నిబంధనల ప్రకారం 104 వాహనాల్లో 47 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలి. కానీ.. గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు ఇవేమీ అందడం లేదు. 104 వాహనాల్లో రక్తపరీక్షలు చేయకుండానే, వారిలో సమస్య ఎంత స్థాయిలో ఉందో తెలుసుకోకుండానే మందులు ఇచ్చేస్తున్నారు. మరోవైపు గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలు కూడా మందులు కావాలంటే తాము పీహెచ్‌సీల్లో తీసుకుంటామని, తమకు రక్తపరీక్షలు కూడా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# సీజేఐపై దాడి యత్నానికి లాయర్ల నిరసన




అమరావతి, అక్టోబర్8 (టుడే విదుర) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పై దాడి యత్నాన్ని నిరసిస్తూ హైకోర్టు వద్ద న్యాయవాదులు నిరసన తెలిపారు. ఏపీ హైకోర్టు ఆవరణలోని జాతీయ జెండా వద్ద హైకోర్టు న్యాయవాదుల సంఘం, ఏపీ హైకోర్టు అంబేద్కరైట్స్ అడ్వొకేట్ అసోసియేషన్ చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున న్యాయవాదులు పాల్గొన్నారు. సీజేఐపై దాడి యత్నాన్ని ముక్తకంఠంతో ఖండించారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పోసాని వెంకటేశ్వర్లు, కె.చిదంబరం తదితరులు మాట్లాడుతూ... సీజేఐపైనే దాడికి యత్నించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. దాడికి ప్రయత్నించిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని కోరారు. సనాతన ధర్మం పేరుతో చేసే దాడులను క్షమించడానికి వీల్లేదన్నారు.

# జాడలేని పక్షి రక్షణ పేరిటరూ.7 కోట్లు భక్షణ!



అక్టోబర్8 (టుడే విదుర)అరుదైన, అంతరించిపోతున్న పక్షి జాతిని కాపాడేందుకు ఎన్ని కోట్లయినా ఖర్చు పెట్టొచ్చు! కానీ... అసలు అక్కడ ఆ పక్షి ఉనికి లేనే లేదని నిర్ధారణ అయిన తర్వాత కూడా 'రక్షణ' పేరిట కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధపడితే? అది నిజంగానే 'అరుదైన' అవినీతే అవుతుంది. ప్రస్తుతం రాష్ట్ర విద్యుత్ శాఖ బట్టమేక (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ – జీఐబీ) రక్షణ పేరుతో ఇదే చేస్తోంది. వివరాల్లోకి వెళితే... అంతరించిపోతున్న పక్షి జాతి బట్టమేక! రాష్ట్రంలో చివరిగా మూడున్నరేళ్ల క్రితం ఈ అరుదైన పక్షి కనిపించింది. ఈ పక్షి సుమారు మూడు అడుగుల ఎత్తు.. 18 కేజీల బరువు ఉంటుంది. ఈ పక్షి రెక్కలు విప్పితే ఏడు అడుగులు ఉంటాయి. నంద్యాల జిల్లాలోని రోళ్లపాడు వైల్డ్ లైఫ్ శాంక్చురీలో చివరిసారిగా ఈ పక్షి 2022 మార్చి 15న కనిపించిందని అటవీశాఖ రికార్డులు చెబుతున్నాయి. ఆ తర్వాత దీని జాడే లేదు. 'రోళ్లపాడులో జీఐబీ పునరుద్ధరణ సాధ్యం కాదు. కొన్నేళ్లుగా ఈ పక్షి ఆనవాళ్లు లేవు' అని వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ) తన నివేదికలో ధ్రువీకరించింది. దేశంలోని జాతీయ పార్కులు, వైల్డ్ లైఫ్ శాంక్చురీల పనితీరుపై 2020–25 సంవత్సరాలకు సంబంధించి రూపొందించిన నిర్వహణ ప్రభావ అంచనా నివేదికలో ఈ విషయాన్ని డబ్ల్యూఐఐ ప్రస్తావించింది. అంటే... రోళ్లపాడులో బట్టమేక పక్షి లేనట్లే!

# నేడు సీమలో భారీ వర్షాలు




విశాఖపట్నం/అమరావతి, అక్టోబర్8 (టుడే విదుర) నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంతో పాటు ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురిశాయి. కోనసీమ జిల్లా ఐ.పోలవరంలో 9.12, అనకాపల్లిలో 7.05, చీపురుపల్లిలో 6.67, కోటనందూరులో 6.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా, దేశంలోనే అత్యధికంగా నెల్లూరులో 37.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు, రాయలసీమలో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

# కేజీహెచ్‌లో కోలుకుంటున్న విద్యార్థినులు




%విశాఖపట్నం, అక్టోబర్8 (టుడే విదుర) పచ్చకామెర్లతో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు క్రమంగా కోలుకుంటున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, వాంతులు తదితర లక్షణాలతో బాధపడుతున్న 51 మంది విద్యార్థినులను ఈ నెల 4న పార్వతీపురం ఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. రక్తపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ నిర్వహించిన వైద్యులు విద్యార్థినులంతా పచ్చకామెర్లతో బాధపడుతున్నట్టు నిర్ధారించారు. వారికి అందించే వైద్య సేవలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి నేతృత్వంలోని వైద్యుల బృందం పర్యవేక్షిస్తుంది. మూడు షిఫ్టుల్లో వైద్య సేవలు అందించేందుకు వీలుగా వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని నియమించారు. వ్యాధి తగ్గుముఖం పట్టిన ఎనిమిది మందిని సాయంత్రం డిశ్చార్జి చేశారు. అయితే మరికొద్ది రోజుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక అంబులెన్స్‌లో వారిని పార్వతీపురం ఆస్పత్రికి తరలించారు. కాగా పార్వతీపురం ఆస్పత్రి నుంచి ల సాయంత్రం మరో ఏడుగురు విద్యార్థినులు కేజీహెచ్‌కు వచ్చారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో 50 మంది బాలికలకు చికిత్స అందిస్తున్నారు.

# ఎస్వీ జూపార్కులో జాగ్వార్ కుశ మృతి



మంగళం, అక్టోబర్8 (టుడే విదుర): తిరుపతిలోని ఎస్వీ జూపార్కులో కుశ అనే మగ జాగ్వార్ మృతి చెందినట్లు జూక్యూరేటర్ సెల్వం తెలిపారు. 'కుశను 2019లో హైదరాబాద్ నెహ్రూ జులాజికల్ పార్కు నుంచి తీసుకొచ్చాం. దీని వయసు 15 సంవత్సరాల మూడు నెలలు. ఎప్పటిలాగే ఆవరణలోకి ఈ జాగ్వార్‌ను పెట్టగా ఒక చెట్టుకు చిక్కుకొని చనిపోయి కనిపించింది' అని ఆయన వివరించారు. కుశ మృతికి హైపర్ వాల్మీక్ షాక్, ఆస్ఫిజియా కారణమని ఎస్వీ వెటర్నరీ విశ్వవిద్యాలయంలోని పాథాలజిస్టులు పోస్టుమార్టం నివేదికలో పేర్కొన్నారు.

# నెల్లూరులో జంట హత్యల కలకలం

**విచక్షణారహితంగా కొట్టి..**
**కాలువలో పడేసిన ఆగంతకులు**
**స్థానికుల సమాచారంతో**
**మృతదేహాల వెలికితీత**



నెల్లూరు (క్రైం),అక్టోబర్8 (టుడే విదుర) నెల్లూరులో జంట హత్యలు వెలుగు చూశాయి. పోలీసుల కథనం మేరకు.. పెన్నా బ్యారేజీ సమీపంలో తిక్కన పార్కు ఎదుట రక్తం ధారలుగా ఉ ందని, జాఫర్ కాలువలో ఓ మృతదేహం ఉన్నట్టు నెల్లూరు నగరంలోని సంతపేట పోలీసులకు ఉదయం ఫోన్ వచ్చింది. వెంటనే ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు ఘటనా స్థలాన్ని పరిశీలించి జాఫర్ సాహెబ్ కాలువలోని మృతదేహాన్ని వెలికి తీశారు. అదే కాలువలో వంద మీటర్ల దూరంలో మరో మృతదేహాన్ని పోలీసులు గుర్తించి బయటకు తీశారు. మృతుల్లో ఒకరు బాపట్ల ప్రాంతానికి చెందిన సంచార జీవి ఎం.పోలయ్యగా గుర్తించారు. తన రెండవ భార్య లక్ష్మితో కలిసి పెన్నా నదిలో ఓ చిన్న గుడారం వేసుకొని పోలయ్య జీవిస్తున్నాడు. మరో మృతుడిని కూడా సంచార జీవి శివగా పోలీసులు గుర్తించారు. పెన్నా నదిలో చేపలు పట్టుకునే వారిని ఇంత కిరాతకంగా హత్య చేయాల్సిన అవసరం ఎవరికి ఉందన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ ప్రాంతంలో ఉండే స్థానికులు మాత్రం నదిలో గంజాయి సేవించే వారే ఈ దారుణానికి పాల్పడి ఉంటారని, గంజాయి మత్తు లో చేపల వేటకు వెళుతున్న వారిపై దాడి చేసి హత్య చేసి ఉంటారని చెబుతున్నారు. మరోవైపు దాడి చేసిన ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరా పనిచేయట్లేదు. ఐదుగురికిపైగా ఈ దారుణానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు.

# లోన్ యాప్‌లతో జాగ్రత్త




విశాఖపట్నం, అక్టోబర్8 (టుడే విదుర)సైబర్ మోసగాళ్ల ఖాతాల నుంచి రికవరీ చేసిన రూ.7.2 లక్షల నగదును నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి మంగళవారం ఇన్‌స్టెంట్ లోన్ యాప్ బాధితులకు అందజేశారు. పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేసేందుకు వేసే ఎత్తులో ఇన్‌స్టెంట్ లోన్ యాప్ అనేది ఒకటన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారు లోన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని రుణాలు తీసుకుంటారన్నారు. రుణం తీసుకున్న తర్వాత సైబర్ నేరగాళు తమ అసలు స్వరూపాన్ని చూపిస్తారన్నారు. రుణం తీసుకున్న వెంటనే తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయడంతోపాటు పూర్తిగా చెల్లించిన తర్వాత కూడా ఇంకా చెల్లించాల్సి ఉందంటూ వేధిస్తారన్నారు. ఎవరైనా ఇక చెల్లించబోమని చెప్పినా, వారి బాధ తట్టుకోలేక ఫోన్‌ను ఆపేసినా వారి ఫోన్‌లోని కాంటాక్ట్‌లకు బాధితుల న్యూడ్ ఫొటోలు, వీడియోలను ఎడిటింగ్ చేసి పంపించి బ్లాక్‌మెయిల్ చేస్తారన్నారు. దీనిని తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడితే, మరికొందరు ఎవరి వద్దనైనా అప్పులు చేసి సైబర్ నేరగాళ్లకు చెల్లింపులు జరుపుతూనే ఉంటారన్నారు. ఈ తరహా మోసాలకు సంబంధించి నగరంలో ఇప్పటివరకూ 317 మంది పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోని క్రిప్టో కరెన్సీని సీజ్ చేశామన్నారు. దీనిపై న్యాయపరమైన సంప్రతింపులు జరిపి, వివిధ ప్రక్రియలను పూర్తిచేసిన తర్వాత సీజ్ చేసిన క్రిప్టో కరెన్సీని ఇండియన్ కరెన్సీలోకి మార్చామన్నారు. మొదటి దశలో రూ.48,59,072ను వంద మంది బాధితులకు ఈ ఏడాది ఏప్రిల్‌లో అందజేశామన్నారు. రెండో దశలో భాగంగా 26 మందికి మంగళవారం రూ.7,20,647 అందజేస్తున్నామన్నారు. ఇన్‌స్టెంట్ లోన్ యాప్ మోసాలకు సంబంధించిన కేసులు దేశవ్యాప్తంగా పెరుగుతున్నాయని, నగరవాసులు కూడా అప్రమత్తంగా ఉండాలని సీపీ కోరారు. ఎవరైనా సైబర్ మోసాలకుగానీ, ఇతర మోసాలకు గానీ గురైతే 7995095799 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తమకు జరిగిన మోసాన్ని వీలైనంత వేగంగా వివరించగలిగితే ఆ మొత్తాన్ని సైబర్ నేరగాళ్లకు చేరకుండా నిలుపుదల చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. బాధితులకు రికవరీ చేసిన మొత్తాన్ని సీపీ అందజేశారు. ఈ సమావేశంలో క్రైమ్ డీసీపీ కె.లతామాధురి, క్రైమ్ ఏడీసీపీ ఫల్గుణరావు, ద్వారకా ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# కులగణన తరువాతే స్థానిక ఎన్నికలు : సీపీఐ



గుంటూరు(తూర్పు), అక్టోబర్8 (టుడే విదుర):ఆంధ్రప్రదేశ్‌లో కులగణన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జనగణనలో కులగణన తక్షణమే చేపట్టాలని... బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలని కోరుతూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతి?థిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ కులగణన జరిగితే కులాల వారీగా జనాభా, సామాజిక స్థితిగతులు తెలుస్తాయని, తద్వారా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించవచ్చని చెప్పారు.

# వద్దన్నా పెళ్లి చేసుకున్నాడని.. నవ వరుడిని చంపేశారు



గుంటూరు, గుంటూరు కార్పొరేషన్, అక్టోబర్8 (టుడే విదుర): ప్రేమ పెళ్లి ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. తన చెల్లిని ప్రేమించి పెళ్లి చేసుకోవడం ఇష్టం లేని ఆమె అన్న.. మరో ఇరువురితో కలిసి నవ వరుడు కుర్రా నాగ గణేశ్(25)ను కత్తులతో పొడిచి దారుణంగా హతమార్చాడు. ఈ ఘటన మధ్యాహ్నం పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పొన్నూరు రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కుర్రా నాగ గణేశ్ స్వగ్రామం బాపట్ల జిల్లా వేమూరు మండలం యడవూరు. కుటుంబంతో కలిసి గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం సంగంజాగర్లమూడిలో ఉంటున్నారు. గణేశ్ గుంటూరులోని పవర్ ఆఫీసులో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ, కార్యాలయానికి సమీపంలోని బుడంపాడులో మూడు నెలలుగా నివాసం ఉంటున్నాడు. కొద్ది నెలల క్రితం నాగ గణేశ్ తెనాలి రూరల్ మండలం కొలకలూరుకు చెందిన కీర్తి అంజనీదేవి ఇంటికి పెళ్లి చూపులకు వెళ్లాడు. పెళ్లిచూపుల్లో ఒకరినొకరు ఇష్టపడ్డారు. అయితే అంజనీదేవి సోదరుడు, కుటుంబ సభ్యులు ఈ సంబంధాన్ని నిరాకరించారు. అయినప్పటికీ ఇరువురూ ఫోన్లో మాట్లాడుకుంటూ ప్రేమించుకున్నారు. ఈక్రమంలో గత నెల 25న ఇంట్లో చెప్పకుండా పారిపోయి అమరావతి ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. వివాహ అనంతరం బుడంపాడులో కాపురం పెట్టారు. పోలీసుల కౌన్సెలింగ్..: ప్రేమించి పెళ్లి చేసుకున్న నవజంట రక్షణ కోరుతూ నల్లపాడు పోలీసులను ఆశ్రయించగా, సీఐ వంశీధర్ ఇరు కుటుంబాలనూ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. అయితే వరుడు నాగ గణేశ్‌ను చంపేస్తానంటూ స్టేషన్ వద్ద కూడా వధువు అన్న దుర్గారావు హెచ్చరించినట్లు తెలిసింది. దుర్గారావు హెచ్చరికలను గణేశ్ సీరియస్‌గా తీసుకోకపోయినప్పటికీ, పెళ్లయినప్పటి నుంచి గతంలో లాగా స్వేచ్ఛగా బయట తిరగకుండా ఇంటిపట్టునే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఉదయం తన స్నేహితుడైన సంగుల కరుణ అనే యువకుడితో కలిసి నాగ గణేశ్ ద్విచక్ర వాహనంపై గుంటూరులోని ముత్తూట్ ఫైనాన్స్‌కు వెళ్లి బంగారం కుదువపెట్టి డబ్బు తీసుకున్నాడు. తిరిగి పొన్నూరు రోడ్డు మీదుగా ఇరువురూ ఇంటికి వెళ్తుండగా, మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో దుర్గారావు మరో ఇరువురుతో కలిసి వీరిని అడ్డగించి గొడవపడ్డాడు. తొలుత నాగ గణేశ్ రాయితో కొట్టి ఆ తర్వాత కత్తులతో పొడిచి అక్కడి నుంచి పరారయ్యారు. స్నేహితుడు కరుణ వెంటనే గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాడు. అయితే అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

# వైద్యుడు లేడు.. సిబ్బంది లేరు..



అద్దంకి, అక్టోబర్8 (టుడే విదుర) అద్దంకి తాలూకాలో మొట్టమొదటిగా 58 సంవత్సరాల క్రితం బొమ్మనంపాడులో పశువైద్యశాల ఏర్పాటు చేశారు. అప్పట్లో అద్దంకి తాలూకా మొత్తం మీద బొమ్మనంపాడులో మాత్రమే పశువైద్యశాల ఉంది. అనంతరం పలు చోట్ల పశువైద్యశాల ఏర్పాటు చేశారు. ఆ తరువాత అద్దంకి పట్టణంలో అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి పశువైద్యశాల ఏర్పాటు చేసినా వైద్యశాలకు తీసుకొచ్చిన పశువులకు మాత్రమే వైద్యం చేస్తారు. దీంతో అద్దంకి మండలంలోని మిగిలిన అన్ని గ్రామాలకు బొమ్మనంపాడు పశువైద్యశాల నుండే వైద్యం అందాల్సి ఉంది. అన్ని మండలాలలో మూడు, నాలుగు చొప్పున పశువైద్యశాలలు ఉన్నా అద్దంకి మండలం మొత్తానికి ఒకే ఒక పశువైద్యశాల ఉంది. అయితే ప్రస్తుతం బొమ్మనంపాడు పశువైద్యశాలలో ఉండాల్సిన వైద్యుడు, వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి నియమించినా ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో కూడా తెలియని పరిస్థితి ఉంది. రోజులో ఒక గంట పాటు ఎవరో ఒకరు వచ్చి వెళుతుంటారని గ్రామస్థులు, రైతులు తెలిపారు. దీంతో ఎప్పుడూ తాళాలు వేసి దర్శనమిస్తోంది. పశుపోషకులు తప్పనిసరి పరిస్థితులలో ప్రైవేటు వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అద్దంకి మండలంలో మొత్తం 26 గ్రామపంచాయతీలు ఉండగా అధికారిక లెక్కల ప్రకారం గొర్రెలు, మేకలు, గేదెలు ఇతర పశువులు 73 వేల వరకు ఉన్నాయి. ఇక కోళ్లు సుమారు 13 వేల వరకు ఉన్నాయి. అద్దంకి పట్టణం మినహా మిగిలిన అన్ని గ్రామాలకు బొమ్మనంపాడు పశువైద్యశాల నుండే వైద్యం అందాల్సి ఉంది. అదనంగా కనీసం మరో రెండు, మూడు పశువైద్యశాలలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం కొత్త పశువైద్యశాలల ఏర్పాటు పరిస్థితి అటుంచితే ఉన్న ఒక్క పశు వైద్యశాలలో కూడా అటు వైద్యుడు కానీ, సిబ్బంది కానీ లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బొమ్మనంపాడు పశు వైద్యశాలలో ఖాళీగా ఉన్న వైద్యుడు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయడంతో పాటు అదనంగా పశువైద్యశాలలు ఏర్పాటు చేయాలని పశుపోషకులు కోరుతున్నారు. పుష్కరకాలం క్రితం బొమ్మనంపాడులో నిర్మించిన పశు వైద్యశాల భవనం నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచాయి. దీంతో శిథిలావస్థకు చేరిన పాత పశువైద్యశాలలోనే వైద్యం అందించాల్సిన పరిస్థితి.

# ఒక్క బస్తా కోసం క్యూలో 15 గంటలు



ఈపూరు :అక్టోబర్8 (టుడే విదుర): యూరియా కోసం రైతులు మండల కేంద్రమైన ఈపూరులోని మన గ్రోమోర్ వద్ద తెల్లవారుజాము 6 గంటలకే వందల సంఖ్యలో బారులు తీరారు. మన గ్రోమోర్ కేంద్రంలో 440 బస్తాల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉంచగా పేర్లు నమోదు చేసుకున్న రైతులకు మన గ్రోమోర్ సిబ్బంది ఒక్కొక్క బస్తాను మాత్రమే పంపిణీ చేశారు. ఈపూరుకు చెందిన రైతులు తమకే యూరియాను పంపిణీ చేయాలని చుట్టుపక్కల గ్రామాల రైతులతో వాగ్వాదానికి దిగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్ది చెప్పారు. రాత్రి ఏడు గంటల వరకు యూరియా కోసం రైతులు క్యూలో నిలబడి ఉన్నారు. బస్తా యూరియా కోసం తిండి, నీరు లేక 15 గంటలు ఎదురు చూశామని, వాపోయారు. గతంలో యూరియా కోసం ఇటువంటి ఇబ్బంది రాలేదని, పంటలకు సరైన సమయంలో పోషకాలు అందించకపోతే మొక్క ఎదుగుదల లేక నష్టపోతామని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. దిగుమతి అయిన యూరియా బస్తాల్లో కొంత రైతులకు ఇచ్చినా మిగిలిన యూరియా బస్తాలను రాత్రి సమయాలలో పక్కదారి పట్టిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

# పని గంటల బిల్లును ఉపసంహరించాలి




అక్టోబర్8 (టుడే విదుర):రాజమహేంద్రవరం ఎపిలో ప్రభుత్వం కార్మికులకు పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంచడాన్ని వ్యతిరేకస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శ్యామలా సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ కార్మికవర్గం అంతర్జాతీయంగా పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని మార్చడం దుర్మార్గం అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌లోని అంశాలను రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అమలు చెయ్యడాన్ని ఖండించారు. ఎపి అసెంబ్లీలో ఎన్‌డిఎ పార్టీలు అన్నీ కలిసి ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో పని చేసే కార్మికుల పని గంటల పెంపును ఆమోదించారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకూ కనీస వేతనాలు పెంచని ప్రభుత్వం పని గంటలు పెంచడాన్ని విమర్శించారు. మహిళలకు రక్షణ కొరవడుతున్న పరిస్థితులు ఉన్న సమయంలో రాత్రి షిఫ్ట్‌లో పని చేయాలని చట్టం చెయ్యడం దుర్మార్గం అన్నారు. కార్మిక వర్గంపై కనీసమైనా చిత్త శుద్ధి ఉంటే బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. బిల్లుకు వ్యతిరేకంగా కార్మికవర్గం తమ నిరసనను తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు టి.అరుణ్, ఎస్ఎస్.మూర్తి, బి.పూర్ణిమరాజు, ఎస్.వెంకటేశ్వరావు, సోమేశ్వరావు, ఐ.సుబ్రహ్మణ్యం, శేషరావు, కాంతారావు, సత్తిరాజు పాల్గొన్నారు.

# పెద్దదోర్నాల హైవేలో లారీ బోల్తా



–పెద్దదోర్నాల :అక్టోబర్8 (టుడే విదుర): ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల హైవేపై రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వేగంగా వస్తున్న లారీ నియంత్రణ కోల్పోయి బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడగా, అక్కడికక్కడే హైవే మీద ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. హైవేలో రోడ్డు ప్రమాదానికి ప్రధాన కారణం ఇటు శ్రీశైలం వైపు అటు కర్నూల్ వైపు వెళ్లే సూచికలు లేకపోవడం రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో అతివేగంతో ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి.

# కొవ్వాడలో పట్టపగలే చోరీ



కాకినాడ రూరల్, అక్టోబర్8 (టుడే విదుర) కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం కొవ్వాడలోని ప్రధాన కూడలి సమీపంలోని ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. సుమారు 50 కాసుల బంగారం అపహరణకు గురైంది. ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఇంటి యజమాని మక్కా చిన్నారావు కిర్లంపూడి ఎంఈవోగా, ఆయన భార్య మాధవపట్నం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం 8 గంటల తర్వాత దంపతులిద్దరూ ఇంటి గేటుకి, ప్రధాన ద్వారానికి తాళాలు వేసుకుని ఉద్యోగాలకు వెళ్లారు. సాయంత్రం 5గంటలకు చిన్నారావు ఇంటికి వచ్చి చూసేసరికి తాళా లు బద్దలుగొట్టి తలుపులు తెరిచి ఉండడంతో కంగారుపడి చోరీ జరిగినట్టు ఇంద్రపాలెం పోలీసులకు సమాచారమిచ్చారు. కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, క్లూస్ టీం చోరీ జరిగిన ఇంటిని పరిశీలించింది. చిన్నారావు ఫిర్యాదు మే రకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రమాదకరంగా రోడ్డు మలుపు



ధర్మవరంరూరల్, అక్టోబర్8 (టుడే విదుర): మండలంలోని ధర్మవరం– అనంతపురం రహదారిలో చిగిచెర్ల సమీపంలోని మలుపు ప్రమాదకరంగా మారింది. చిగిచెర్ల విద్యుత సబ్‌స్టేషన ముందుభాగంలో రోడ్డు మలుపువద్ద కంపచెట్లు ఏపుగా పెరగడంతో రోడ్డు కని పించక తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికే పలువురు మృత్యువాతపడ్డారు. ప్రధానంగా ఎటువంటి సూచిక బోర్డులుగానీ, రక్షణ కవచంగా డివైడర్లు లేక పోవడంతో మలుపు వద్ద ద్విచక్రవాహనాలు అదుపుకాక కిందపడి పలువురు మృత్యువాతపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మలుపు వద్ద కంపచెట్లు తొలగించి, మలుపు కనిపించేలా సూచిక బోర్డులు, డివైడర్లను ఏర్పాటుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

# మహిళలకు సఖి సురక్ష

## 35 ఏళ్లు పైబడిన వారందరికీ ఆరోగ్య పరీక్షలు రేపు విశాఖలో ప్రారంభించనున్న మెప్మా



అమరావతి, అక్టోబర్8 (టుడే విదుర) పట్టణ మహిళా సంఘాల కోసం మెప్మా రెండు కొత్త కార్యక్రమాలను ప్రారంభించనుంది. 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్'లో భాగంగా 'సఖి సురక్ష' కార్యక్రమాన్ని ఈ నెల 9న విశాఖలో ప్రారంభించనుంది. దీనిలో భాగంగా 35ఏళ్లు పైబడిన మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. 74 మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అదేవిధంగా పట్టణ మహిళా సంఘాల కుటుంబాల్లోని నిరుద్యోగుల కోసం జాబ్‌మేళాలు నిర్వహిస్తారు. ఈ నెల 8న శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో 20 కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మెప్మా తెలిపింది.

# మంత్రం వేస్తానంటూ..

# యువతిని ముగ్గులోకి దించిన ఫేక్ బాబా

%హైదరాబాద్, అక్టోబర్8 (టుడే విదుర) ఓ యువతి ని ఫేక్ బాబా మోసగించాడు ఈ సంఘటన హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలోని నవాబ్ సాహెబ్ కుంటలో జరిగింది. ఈ కేసుకి సంబంధించిన వివరాలను పాత బస్తీ పోలీసులు వెల్లడించారు. హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలోని నవాబ్ సాహెబ్ కుంటలో నివసించే కుటుంబానికి చెందిన ఒక యువతి అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఇదే అదునుగా భావించిన నకిలీ బాబా వారి కుటుంబాన్ని మోసం చేశాడు. యువతికి మంత్రించి బాగుచేస్తానని చెబుతూ ఓ బాబా రోజూ ఇంటికి వచ్చేవాడు. మంత్రాలు వేస్తే ఆరోగ్యం మెరుగవుతుందనే నమ్మకంతో తల్లిదండ్రులు ఆ యువతిని ఆయన వద్దకు తరచూ పంపించారు. ఒక దశలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న యువతిని దర్గాలో మంత్రిస్తే పూర్తిగా కోలుకుంటుందని నమ్మించి ఆమెను తీసుకెళ్లి తనతో వివాహం చేసుకున్నాడు. కొన్ని రోజుల పాటు కూతురు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పాతబస్తీ పోలీసులను ఆశ్రయించారు. యువతి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇంతలో యువతి తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడింది. తాను మేజర్‌ని అని, ప్రేమించి స్వచ్ఛందంగా అతనిని వివాహం చేసుకున్నానని చెప్పింది. అంతేకాదు సమయం, సందర్భం చూసుకుని నిర్ణయం తీసుకున్నానని, అంతా తన ఇష్టపూర్వకంగానే జరిగిందంటూ క్లారిటీ ఇచ్చింది. యువతి



స్వచ్ఛందంగా వెళ్లిందని తెలిసిన వెంటనే మిస్సింగ్ కేసును పాత బస్తీ పోలీసులు క్లోజ్ చేశారు. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే బాబాకి ఇది వరకే పెళ్లయి ఇద్దరు పిల్లలు ఉన్నారని చెబుతున్నారు పోలీసులు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తీవ్ర విచారంలో మునిగిపోయారు. తమ కూతురు తిరిగి తమ దగ్గరికి రావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మాయ మాటలు చెప్పి మంత్రాల పేరిట యువతిని ప్రభావితం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలంటూ యువతి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

# అధిక వడ్డీ ఎర.. కోట్లలో అప్పులు!



నల్లగొండ క్రైం/పీఏపల్లి, అక్టోబర్8 (టుడే విదుర) రెండు కోట్ల రూపాయలు 'పెట్టుబడి' తెస్తే ఏజెంట్లకు స్విఫ్ట్ కారు బహుమానం. రూ.కోటి తెస్తే లక్షల విలువైన బైక్ నజరానా. ఏజెంట్లకు 6 శాతం కమీషన్.. డబ్బు ఇచ్చిన వారికి 10 శాతం వడ్డీ! ఇలా ఓ ఘరానా మోసగాడు అధిక వడ్డీలు, ఏజెంట్లకు కమిషన్ల ఆశ చూపి కోట్లాది రూపాయలు అప్పులు తీసుకుని పరారయ్యాడు. దాంతో మధ్యవర్తిగా ఉండి కోటి రూపాయలు అప్పులు ఇప్పించిన వ్యక్తి ఆందోళనతో ఆత్మహత్యాయత్నం చేశాడు. మంగళవారం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం వద్దిపట్ల పంచాయతీ పరిధిలోని పలుగుతండాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పలుగుతండాకు చెందిన రమావత్ సరియా నాయక్ మధ్యవర్తిగా ఉండి తన బంధువు రమావత్ బాలాజీ నాయక్‌కు రూ.కోటి వరకు అప్పులు ఇప్పించాడు. దీనికి బాలాజీ నాయక్ నెల నెలా 10 శాతం వడ్డీ, సరియా నాయక్‌కు 6 శాతం కమీషన్ ఇస్తున్నాడు. అయితే మూడు నెలలుగా వడ్డీ ఇవ్వకపోగా, 15 రోజులుగా బాలాజీ ఫోన్‌లో కూడా దొరకడం లేదు. దీంతో ఒత్తిడికి లోనైన సరియా నాయక్ రాత్రి మిర్యాలగూడలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతన్ని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా.. వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సరియా నాయక్ బంధువులు, బాధితులు300మంది బాలాజీ నాయక్ ఇంటిపై దాడి చేశారు. ఫర్నిచర్ ధ్వంసం చేసి బయటకు తెచ్చి నిప్పుపెట్టారు. ఈ ఘటనలపై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని పెద్దఅడిశర్లపల్లి పోలీసులు చెబుతున్నారు. వాస్తవానికి బాలాజీనాయక్ అధిక వడ్డీల ఎర వేసి సుమారు వెయ్యి కోట్ల వరకు సేకరించినట్లు నాలుగు నెలల క్రితమే వెలుగులోకి వచ్చింది. దేవరకొండ ఏరియా పబ్లిక్ ఫ్రాడ్ అవేర్‌నెస్ గ్రూప్ అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు జూన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.1,000 కోట్ల వరకు అక్రమంగా సమీకరించాడని పేర్కొన్నారు. కానీ, విచారణ ముందుకు సాగలేదు. ఈ లోపు కొందరు పంచాయితీ నిర్వహించి మూడు నెలల్లో ఎవరి డబ్బులు వారికివ్వాలని సూచించారని, దీంతో బాధితులెవరూ అధికారికంగా ఫిర్యాదులు చేయలేదని తెలుస్తోంది. పెద్దసంఖ్యలో ఏజెంట్లను నియమించుకున్న బాలాజీ నాయక్ పీఏ పల్లితో పాటు, చందంపేట, కొండమల్లేపల్లి, మిర్యాలగూడ, దేవరకొండ, తిరుమలగిరి (సాగర్) ప్రాంతాల్లో గిరిజనులు, ఉద్యోగులు, అధికారుల నుంచి అప్పులు తీసుకున్నాడు. వారికి నెలకు 10 శాతం వడ్డీ, ఏజెంట్లకు 6 శాతం కమీషన్ ఠంచనుగా ఇచ్చేవాడని, అలా నమ్మకం కలిగించి రూ.1,000కోట్లు సేకరించాడని చెబుతున్నారు. ఏజెంట్లకు నజరానాలు భారీగా ఇచ్చేవాడని, రూ.2 కోట్ల వరకు పెట్టుబడి తెస్తే స్విఫ్ట్ కారు, రూ.కోటి తెస్తే లక్ష విలువైన బైక్ ఇచ్చేవాడని చెబుతున్నారు. స్వగ్రామంలో రూ.3 కోట్లతో ఇల్లు కట్టుకున్న బాలాజీ నాయక్.. ఇటీవల తన పుట్టిన రోజు పార్టీకి రూ.50 లక్షలు ఖర్చు చేశాడని తెలుస్తోంది.

# నక్సల్స్ అడ్డాలో విదేశీయులు

**నంబి జలపాతాన్ని సందర్శించిన జర్మనీ పర్యాటకులు**

**ఆపరేషన్ కగార్‌తో మారుతున్న బస్తర్ ముఖ చిత్రం**

చర్ల, అక్టోబర్8 (టుడే విదుర)ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నక్సల్స్ ప్రభావవిత ప్రాంతం బస్తర్ అడవుల పేరు వినగానే ఒకప్పుడు ప్రజలు భయపడేవారు. కానీ, 'ఆపరేషన్ కగార్'తో ఆ పరిస్థితి మారింది. కేంద్ర బలగాలు అడవుల్లో అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టడంతో బస్తర్ ముఖచిత్రం కొత్తదనం సంతరించుకుంది. ఎత్తైన గుట్టలు, లోయలు, కనువిందు చేసే జలపాతాలతో నిండిన బస్తర్ అంటేనే అందాలకు నిలయం. గతంలో రోడ్డు సౌకర్యం లేక జిల్లా కేంద్రాలకే పరిమితమైన పర్యాటకులు, ఇప్పుడు మారుమూల ప్రాంతాలకు కూడా తరలివస్తున్నారు. ఈ అభివృద్ధి నేపథ్యంలో, బీజాపూర్ జిల్లాలోని నంబి జలపాతాన్ని సందర్శించడానికి ఇద్దరు జర్మనీ దేశస్థులు వచ్చారు. వారు నంబి గ్రామస్థులతో మాట్లాడారు. జలపాతం అందాలను తమ కెమెరాల్లో బంధించారు. స్థానికులతో వంట వండించుకుని భోజనం చేశారు. ఆ విదేశీ



పర్యాటకులు ఇక్కడి మావోయిస్టులు, వారి జీవనశైలి, పోలీసుల మోహరింపు గురించి, అలాగే ఆదివాసీల జీవన స్థితి గతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎలక్ట్రిక్ వీల్‌చైర్లు

శంషాబాద్ రూరల్, అక్టోబర్8 (టుడే విదుర) విమాన ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలను అందించే దిశగా, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (జీఎంఆర్) ఒక ముందడుగు వేసింది. ప్రయాణికుల కోసం అత్యాధునిక ఎలక్ట్రిక్ వీల్ చైర్లను ప్రవేశపెట్టిన్నట్లు జీఎంఆర్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, వారికి సుఖవంతమైన ప్రయాణ అనుభూతిని అందించడానికి ఈ నూతన వీల్ చైర్లను ప్రవేశపెట్టారు. ఈ ఎలక్ట్రిక్ వీల్ చైర్లు ప్రయాణికుల చెక్ ఇన్ కౌంటర్ దాటిన తర్వాత అందుబాటులోకి వస్తాయి. డీఎఫ్ఎండీ పాయింట్ నుంచి బోర్డింగ్ పాస్ వరకు వీటిని వినియోగించుకోవచ్చు. ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే తమ లక్ష్యమని జీఎంఆర్ అధికారులు స్పష్టం



చేశారు.

# ఇలాంటి తప్పు మళ్లీ చేయను...

**– హెల్మెట్ లేని బైకర్ల ఫోన్లలో వాట్సాప్ స్టేటస్**

**%– వినూత్న కార్యక్రమానికి జీడిమెట్ల పోలీసుల శ్రీకారం**

హైదరాబాద్:అక్టోబర్8 (టుడే విదుర) హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల కలిగే అనర్థాలను వాహనదారులకు వివరిస్తూ జీడిమెట్ల పోలీసులువినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ వారి ఫోన్లలో 'హెల్మెట్ లేకపోవడం వల్ల పోలీసులు నన్ను పట్టుకున్నారు. భవిష్యత్తులో ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకే అని అర్థమైంది. ఇలాంటి తప్పు మళ్లీ చేయను..' అంటూ వాట్సాప్ స్టేటస్)ను పెట్టిస్తున్నారు. %ఇటీవలి కాలంలో అర్ధరాత్రి వేళ హెల్మెట్ లేకుండా అతివేగంగా ప్రయాణించి ప్రమాదాలకు గురై ఎంతో మంది యువకులు ప్రాణాలను కోల్పోయారు. ఈ మరణాలను ఆపేందుకు బాలానగర్ ఏసీపీ నరేష్?రెడ్డి,



జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో హెల్మెట్ లేని వాహనదారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారి ఫోన్‌తోనే ఫొటో తీసి వారి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టించారు. ఇది వాహనదారుల్లో బాధ్యతను పెంచుతుందని ఏసీపీ నరేషరెడ్డి, సీఐ మల్లేష్ అన్నారు.

# 118 మద్యం షాపులు..

# దరఖాస్తులు 54




హైదరాబాద్: అక్టోబర్8 (టుడే విదుర):మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మద్యం షాపుల లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా ప్రొహి బిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్కే ఫయాజ్ ఉద్దీన్, కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సీఐ, బాలానగర్ ఎక్సైజ్ ఇన్‌చార్జ్ సీఐ యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2620 రిటైల్ మద్యం దుకాణాల కేటా యింపును ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. మేడ్చల్ జిల్లా ప్రొహి బిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సూచ నలు మేరకు జిల్లా యూనిట్‌లో మొత్తం 118 మద్యం షాపులు ఉండగా, ఇప్పటి వరకూ 54 దరఖాస్తులు వచ్చాయన్నారు. %వీటిలో బాలానగర్ పరిధిలో 10, కుత్బుల్లాపూర్ పరిధిలో 16, మేడ్చల్ పరిధిలో 28 దరఖాస్తులు అందాయన్నారు. గత నెల 26 నుంచి పీర్జాదీగూడ లోని శ్రీపల్లవి కన్వెన్షన్ సెంటర్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా, ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 8712658727 లో సంప్రదించాలని జిల్లా ప్రొహిబిషన్ అధికారి ఫయాజ్‌ఉద్దీన్ సూచించారు.

# 24 నిమిషాల్లో

# ఎయిర్‌పోర్టు టు కిమ్స్..

హైదరాబాద్: అక్టోబర్8 (టుడే విదుర) శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం( నుంచి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి వరకు ట్రాఫిక్ పోలీసులు సాయంత్రం గ్రీన్ చానల్ ఏర్పాటు చేశారు. 24 నిమిషాల వ్యవధిలోనే ఊపిరితిత్తులు ఆస్పత్రికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. విశాఖపట్నంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఎ.సన్యాసిరావు(67) బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు ఊపిరితిత్తులు దానం చేయడానికి ముందుకొచ్చారు.సికింద్రాబాద్ కిమ్స్)లో ఉన్న ఓ పేషెంట్‌కు కావాలని డాక్టర్లకు సమాచారం అందించడంతో వైజాగ్ నుంచి ఊపిరితిత్తులను ఎయిరిండియా విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తరలించారు. అప్పటికే



అక్కడ సిద్ధంగా ఉన్న సిబ్బంది శంకర్ గణేష్, రాజేష్, డ్రైవర్ అజీజ్ వెంటనే ఊపిరితిత్తులను అంబులెన్స్‌లో 24 నిమిషాల్లో సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి చేర్చారు. ఆస్పత్రిలో ఉన్న పేషెంట్‌కు అమర్చినట్లు సిబ్బంది చెప్పారు. విమానం దిగగానే నేరుగా అంబులెన్స్ వద్దకు చేరుకునేలా కృషి చేసిన సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఒకటికాదు..రెండుకాదు..

## రూ.54.67 లక్షలు గోవిందా.. ఏం జరిగిందంటే..

పటాన్‌చెరు(సంగారెడ్డి)అక్టోబర్8 (టుడే విదుర) బ్రాండెడ్ వస్తువులకు రేటింగ్ ఇస్తే కమిషన్ ఇస్తామంటూ ఓ ఐటీ ఉద్యోగికి రూ. 54.67 లక్షలకు టోకరా వేశారు సైబర్ నేరగాళు .. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్?స్టేషన్‌పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు సీఐ రాజు కథనం ప్రకారం.. బాలానగర్ హెచ్‌సీఎల్ ఉద్యోగి ఇక్కడి ప్రణీత్ కాలనీలో ఉంటున్నారు. ఈ నెల 15న ఆయన ఫోన్‌లోని టెలిగ్రామ్‌కు ఓ మెసేజ్ వచ్చింది. లింక్ తెరిచి చూడగా బ్రాండెడ్ వస్తువులకు రేటింగ్ ఇస్తే కమిషన్ ఇస్తామని ఉంది. దీంతో సందీపరెడ్డి లింక్‌లో ఉన్న విధంగా ఆన్‌లైన్ ఖాతా తెరిచి, ప్రారంభంలో రూ. 5 వేలు వేశాడు. ఇందుకు రూ.12,500 లాభం చూపించారు. మరోసారి రూ.59,800 వేశాడు. క్రమేపీ 7,14,180



రూపాయలు జమ చేశారు. లాభాలు వెనక్కి తీసుకోబోతే క్రెడిట్ స్కోరు( నిమిత్తం రూ.5 లక్షలు కట్టమన్నారు. వీఐపీ చానల్ ఓపెన్ చేయాలంటూ రూ.6 లక్షలు, డబ్బులు విత్‌డ్రా చార్జీలు రూ.12.5 లక్షలు అని మొత్తంగా రూ. 54,67,488 ఖాతాలో జమ చేయించుకున్నారు. చివరగా మరో రూ.8 లక్షలు కడితే మొత్తం డ్రా చేసుకోవచ్చని ఆశ చూపడంతో సందీపరెడ్డికి అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు

# టుడే వినోదం

## అప్పుడు పుష్ప..
## ఇప్పుడు కాంతార అగరబత్తీలు

తుళునాడు ప్రాంతంలోని ఆధ్యా త్మిక సంప్రదాయాలను ఆధారంగా చేసుకుని రూపొందిన కన్నడ చిత్రం కాంతార చాప్టర్-1 . ఇటీవల థియేటర్లలో విడుదలైన ఈ సినిమా దేశవిదేశాలలో బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోన్న సంగతి తెలిసిందే. అయితే.. ఇప్పుడు అదే కాంతార పేరుతోనే సైకిల్ ప్యూర్ ఆగరబత్తి మార్కెట్ లోకి విడుదల చేసింది.ఈ సందర్భంగా హెంబాళ గ్రూప్ కోఫౌండర్, ఎండీ చలువేగౌడ మాట్లాడుతూ.. రిషబ్ శెట్టి దర్శకత్వం చేయడంతో పాటు నటించిన కాంతార ముఖ చిత్రంతోనే బ్రాండ్ విడుదల చేయడం సంతోషంగా ఉందని అభిప్రాయపడ్డారు. కాంతార సినిమా కన్నడ, తులు ప్రజల నమ్మకం, సంప్రదాయాలను ప్రపంచానికి చూపిందని, మన ఆధ్యాత్మిక మూలాలను పరిచయం చేసిందన్నారు.

%సైకిల్ ప్యూర్ ఎండీ అర్జున్ రంగా మాట్లాడుతూ కాంతార కేవలం సినిమాగా మాత్రమే కాకుండా మన పురాతన సంప్రదాయల సంబరం చేసుకునే శక్తిగా అవతరించిందన్నారు. కేఆర్ సిద్ధార్థ మాట్లాడుతూ




కాంతార పేరుతో రెండు బ్రాండ్ల అగరబత్తిలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇదిలాఉంటే.. గతంలో మంగళ్‌దీప్ అగరబత్తీస్ ఇలానే అల్లు అర్జున్ పుష్ప2 ముఖ చిత్రంతో ప్రత్యేక ఆగరబత్తిలను మార్కెట్ లోకి విడుదల చేయడం విశేషం.

## అఫీషియల్.. వార్ 2 ఓటీటీలోకి వచ్చేది అప్పుడే




: ఏదో అనుకుంటే ఇంకేదో అయ్యిందే అన్నట్లు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ కూడా అలాగే అయ్యింది. అసలు ఎన్టీఆర్ (%చీ=%) బాలీవుడ్ ఎంట్రీనే సూపర్ అనుకుంటే.. అది హృతిక్ రోషన్ తో స్క్రీన్ పంచుకుంటున్నాడు అనేసరికి అసలు ఇండస్ట్రీ మొత్తం షేక్ అయ్యింది. వార్ 2 కోసం అభిమానులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసారు. ఎన్టీఆర్ లుక్ దగ్గరనుంచి ట్రైలర్ రిలీజ్ అయ్యేవరకు కూడా హైప్ మాములుగా ఇవ్వలేదు. హృతిక్ ను ఎన్టీఆర్ డామినేట్ చేస్తాడని, ఎన్టీఆర్ ని హృతిక్ డామినేట్ చేస్తాడని, ఇద్దరు హీరోలు ఒకే ఫ్రేమ్ లో కనిపిస్తే థియేటర్లు బ్లాస్ట్ అని అభిమానులు ఎన్నో అంచనాలు పెట్టుకొని థియేటర్ కు వెళ్లారు.ఎన్టీఆర్, హృతిక్ రోషన్ హీరోలుగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కిన వార్ 2 ఎన్నో అంచనాల నడుమ ఆగస్టు 15 న రిలీజ్ అయ్యి భారీ పరాజయాన్ని అందుకుంది. ఎన్టీఆర్ బాలీవుడ్ డెబ్యూ భారీ డిజాస్టర్ అయ్యింది. ఏదో అనుకుంటే ఇంకేదో అయ్యిందని.. అభిమానులు నిరాశకు గురయ్యారు. ఇక మొదటిరోజు టాక్ విని చాలామంది ఓటీటీకి వచ్చినప్పుడు చూసుకుందాంలే అనుకున్నారు. అలాంటివారికి మేకర్స్ గుడ్ న్యూస్ చెప్పుకొచ్చారు. ఎట్టేకలకు వార్ 2 ఓటీటీ బాట పట్టింది. నెట్ ఫ్లిక్స్ ఈ సినిమా హక్కులను కైవసం చేసుకున్న విషయం తెల్సిందే.అక్టోబర్ 9 నుంచి వార్ 2 నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతం ప్రేక్షకుల మైండ్ సెట్ ను ఎవరు అంచనా వేయలేకపోతున్నారు. థియేటర్ లో చూసి సినిమా బాలేదన్నవారే.. ఓటీటీలో చూసి ఎలారా ఈ సినిమను థియేటర్ లో మిస్ అయ్యామని చెప్పుకొస్తున్నారు. మరి వార్ 2 కూడా ఇలాంటి మ్యాజిక్ ఏమైనా చేస్తుందా..? ఓటీటీలో ఈ సినిమా రిజల్ట్ ఎలా ఉంటుందో చూడాలి.

## వింటేజ్ రవితేజను గుర్తుచేసే 'హుడియో హుడియో' గీతం



'మాస్ జాతర' చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'తు మేరా లవర్', 'ఓలే ఓలే' గీతాలు శ్రోతలను ఆకట్టుకొని, సామాజిక మాధ్యమాల్లో హల్చల్ చేస్తున్నాయి. లేటెస్ట్ గా మేకర్స్ థర్డ్ సాంగ్ 'హుడియో హుడియో'ను రిలీజ్ చేశారు. మాస్ అండ్ మెలోడీని అందంగా మిళితం చేసిన ఈ ట్యూన్, అందరినీ కట్టిపడేసేలా ఉంది. విశాఖపట్నం నుండి కిరండూల్ రైలు ప్రయాణం నేపథ్యంలో ఈ పాట సాగడం విశేషం. ఆ మార్గంలోని కొండకోనల అందాలను అద్భుతంగా కాప్చర్ చేశారు. పచ్చని పొలాల నడుమ, గూడెం దారులలో మాస్ మహరాజ్ రవితేజ , అందాల భామ శ్రీలీల తో శేఖర్ మాస్టర్ హృద్యమైన స్టెప్పులు వేయించారు. వీరిద్దరి మధ్య ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ అదిరింది. అక్కడక్కడా వింటేజ్ రవితేజ దర్శనమిచ్చాడు. దేవ్ పవార్ రాసిన పాట సాధారణంగా అనిపించినా... నచ్చిన అమ్మాయి మెచ్చే విధంగా ప్రియుడు వాగ్దానాలు చేయడం సరదాగా ఉంది. పాట చిత్రీకరణలో ఓ ఆర్గానిక్ మూమెంట్ కనిపించింది. 'హుడియో... హుడియో' అనే హుక్ లైన్ తో సాగిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరిచాడు. అతనే పాడాడు... చిత్రం ఏమంటే మరో సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ పాటకు తానూ భీమ్స్ తో గొంతు కలిపాడు. దాంతో ఒక కొత్త అనుభూతిని శ్రోతలకు అందించినట్టు అయ్యింది. 'ముద్దు పెడతా, ముద్ద పెడతా... జోల పాడతా, పిల్లలకు పాలుపడతా' అంటూ ముగించడంతో ఓ పరిపూర్ణత్వం చేకూరింది. %తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు.

## పదిహేనేళ్ల 'ఖలేజా'...

పదిహేనేళ్ళ క్రితం అక్టోబర్ 7వ తేదీన మహేశ్ బాబు త్రివిక్రమ్ కాంబోలో 'ఖలేజా' సినిమా జనం ముందు నిలచింది. సింగనమల రమేశ్ బాబు, సి.కళ్యాణ్, సత్య రామ్మూర్తి నిర్మించిన 'ఖలేజా' పరాజయం పాలయింది. ఆ సినిమాను బుల్లితెరపై వీక్షించిన ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేశారు. వినోదభరితంగా సాగిన 'ఖలేజా' ఎందుకు ఫెయిలయ్యిందో ఎవరూ చెప్పలేకపోయారు. కానీ, టీవీలో వచ్చిన ప్రతీసారి 'ఖలేజా' ఆకట్టుకుంటూనే సాగింది. ఈ మధ్యే 'ఖలేజా' రీ-రిలీజై విశేషాదరణ చూరగొంది. టాలీవుడ్ రీ-రిలీజెస్ మూవీస్ లో నంబర్ వన్ గా నిలచింది 'ఖలేజా'.

'ఖలేజా' 2010లో జనం ముందు నిలచింది. అంతకు ముందు 2006లో జూనియర్ యన్టీఆర్ తో 'రాఖీ' సినిమా తీసిన డాక్టర్ కె.యల్.నారాయణ ఆ తరువాత మహేశ్ హీరోగా రాజమౌళి డైరెక్షన్ లో ఓ సినిమా తీయాలని ప్రయత్నించారు. 'ఖలేజా'కు ముందు మహేశ్ 2007లో 'అతిథి' సినిమాతో జనాన్ని పలకరించారు. ఆ సినిమా ఆట్టే ఆకట్టుకోలేక పోయింది. కారణాలు ఏవైనా మహేశ్ దాదాపు మూడేళ్ళ గ్యాప్ తో 'ఖలేజా'లో నటించారు. ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చాక అలరించలేకపోయింది. అప్పటి నుంచీ మహేశ్, రాజమౌళి డేట్స్ కుదరక కె.యల్.నారాయణ కూడా తన సినిమాను పోస్ట్ పోన్ చేసుకుంటూ వచ్చారు. రాజమౌళి తాను ఎంత ఎత్తుకు



ఎదిగినా, అప్పట్లో ఇచ్చిన మాటకు కట్టుబడి తాను మహేశ్ హీరోగా కె.యల్.నారాయణకు ఓ సినిమా చేయవలసి ఉందని అంటూ చెప్పేవారు. ఇన్నాళ్ళకు అది కార్యరూపం దాల్చడం విశేషం. ఈ యేడాది మహేశ్-రాజమౌళి సినిమా ఆరంభమైనా, ఆ సినిమా మరో రెండేళ్ళకు అంటే 2027లో జనం ముందుకు వస్తుందని వినిపిస్తోంది.'ఖలేజా' సినిమాకు త్రివిక్రమ్ డైరెక్టర్. అది అంతగా మురిపించలేదు.


## ఆ వివాదంపైఎవరు ఏమనుకున్నా పట్టించుకోను..



ఇంట గెలిచి రచ్చ గెలవాలి అంటారు. కన్నడ బ్యూటీ రష్మిక మందన్నా కూడా అదే చేద్దామని ట్రై చేసిందా అంటే.. కిర్రాక్ పార్టీ సినిమాతో కన్నడనాట అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. ఇక అదే గుర్తింపుతో తెలుగులో అడుగుపెట్టి.. ఒక్కో మెట్టు ఎదుగుతూ నేషనల్ క్రష్ గా మారింది. స్టార్ హీరోయిన్ గా ఇండస్ట్రీ మొత్తం ఏలడం మొదలుపెట్టింది. ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మర్చిపోకూడదు అని పెద్దలు చెప్తారు. కానీ, రష్మిక మాత్రం రచ్చ గెలిచి.. మళ్లీ ఇంటివైపు కన్నెత్తి కూడా చూడలేదు.స్టార్ హీరోయిన్ గా ఎదిగాకా కన్నడలో రష్మిక సినిమాలు చేసింది లేదు. ఇక ఏరోజు కూడా కన్నడ ఇండస్ట్రీ గురించి అమ్మడు పట్టించుకున్నది లేదు. ఇది కన్నడిగులకు ఆగ్రహానికి గురిచేసే విషయం. కన్నడలో ఒక మంచి సినిమా రిలీజ్ అయినా.. కన్నడ నటుడుకు అవార్డు వచ్చినా.. కన్నడ ఇండస్ట్రీ వివాదంలో ఉన్నా రష్మిక స్పందించదు. ముఖ్యంగా కన్నడ హీరో రిషబ్ శెట్టికి, రష్మికకు మధ్య మొదటినుంచి విభేదాలు ఉన్నాయన్న విషయం తెల్సిందే. ఆ కోపంతోనే రష్మిక కాంతార సినిమాను ప్రశంసించలేదని కన్నడిగులు కన్నెర్ర చేస్తున్నారు.కాంతార ఎంత పెద్ద విజయాన్ని అందుకుందో అందరికీ తెల్సిందే. ఈ మధ్య రిలీజ్ అయిన కాంతార చాప్టర్ 1 కూడా భారీ విజయాన్ని అందుకుంది. అభిమానులతో కన్నడ స్టార్స్ అందరూ ఈ సినిమాపై ప్రసంశలు కురిపించారు. ఒక్క రష్మిక తప్ప దీంతో.. రష్మికను కన్నడ ఇండస్ట్రీ బ్యాన్ చేసిందని ఒక వార్త పుట్టుకొచ్చింది. తాజాగా ఈ వివాదంపై రష్మిక స్పందించింది. ఆమె నటించిన థామా ప్రమోషన్స్ లో భాగంగా ఈ రూమర్స్ కు చెక్ పెట్టింది.'ఏ సినిమా అయినా నేను రిలీజ్ అయిన రెండు మూడు రోజుల్లో చూడలేను. కొంచెం ఆలస్యంగా చూస్తాను. కాంతార సినిమా కూడా నేను అలాగే చూసాను. అప్పుడు కూడా సినిమా గురించి ఏమి మాట్లాడలేదు అన్నారు. కానీ, నేను సినిమా చూసిన వెంటనే చిత్రబృందాన్ని అభినందిస్తూ మెసేజ్ చేశాను. వారు కూడా నాకు సమాధానం ఇచ్చారు. తెరవెనుక ఏమి జరుగుతుందో ఎవరికీ ఏమి తెలియదు. నా వ్యక్తిగత విషయాలను కెమెరా పెట్టడం నాకు ఇష్టం లేదు. ఆ పని నేను చేయనుకూడా. అందుకే ఈ విషయంలో ఎవరు ఏమన్నా నేను పట్టించుకోన. నా నటన విషయంలో ఎవరైనా అంటే దానిని సీరియస్ గా తీసుకుంటాను' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం రష్మిక వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి.



# క్రీడావార్తలు



## వైజాగ్‌లో పరుగుల వరదే

%విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): మహిళల వరల్డ్‌కప్‌లోని గత రెండు మ్యాచ్‌ల్లో భారత జట్టు బ్యాటింగ్‌లో తడబడింది. ఈ నేపథ్యంలో విశాఖలో బలమైన దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో హర్మన్‌ప్రీత్ సేన తలపడనుంది. అయితే, కీలక మ్యాచ్‌లకు ఎలాంటి పిచ్‌ను తయారు చేస్తారోనన్న చర్చ జోరుగా సాగుతుంది. కానీ, విశాఖలో ఫ్లాట్ పిచ్‌ను తయారు చేశారన్న వార్త భారత బ్యాటర్లకు ఊరటనిచ్చేదే. శ్రీలంక, పాకిస్థాన్‌పై జరిగిన మ్యాచ్‌ల్లో భారత్ గెలిచింది. కానీ, అదంతా బౌలర్ల ప్రతిభతోననే చెప్పుకోవాలి. బ్యాటర్లు విఫలమైనా.. బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థులను కట్టడి చేశారు. కానీ, బిగ్ మ్యాచ్‌లు కావడంతో హర్మన్, స్మృతి ఫామ్‌లోకి రావాలని అభిమానులు కోరుకొంటున్నారు. 'వికెట్ బ్యాటర్లకు అనుకూలం. గత కొన్ని మ్యాచ్‌లను పరిశీలిస్తే.. మంచు ప్రభావం లేకపోతే స్పిన్నర్లకు కొంత సహకారం లభించవచ్చు' అని ఆంధ్ర క్రికెట్ సంఘం తెలిపింది. వైజాగ్‌లో 11 ఏళ్ల తర్వాత మహిళల వన్డే మ్యాచ్ జరుగుతోంది. 2014, జనవరి 23న ఇదే వేదికపై




శ్రీలంకతో భారత్ తలపడింది.

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా గురువారం భారత జట్టుతో తలపడనున్న దక్షిణాఫ్రికా క్రికెటర్లు మంగళవారం విశాఖపట్నం చేరుకున్నారు. సోమవారం ఇండోర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించిన సంగతి తెలిసిందే.

## 30 ఏళ్ల తర్వాత



సెయింట్ లూయిస్ (యూఎస్): చిరకాల ప్రత్యర్థులు, దిగ్గజాలు విశ్వనాథన్ ఆనంద్, గ్యారీ కాస్పరోవ్ 30 ఏళ్ల తర్వాత మళ్లీ తలపడనున్నారు. బుధవారం నుంచి జరిగే క్లచ్ చెస్ టోర్నీలో వీరిద్దరూ 12 గేమ్‌లు ఆడనున్నారు. వినూత్న పాయింట్ల విధానంలో జరిగే టోర్నీలో రోజుకు 4 గేముల్లో తలపడతారు. 1995లో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో వీరిద్దరూ క్లాసిక్ ఫార్మాట్‌లో ఆడగా.. ఈసారి మాత్రం ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్‌లో అమీతుమీ తేల్చుకోనున్నారు. కాగా, వీరిద్దరి 20 గేముల ముఖాముఖీలో కాస్పరోవ్ 10.5-7.5తో విషీపై ఆధిక్యంలో ఉన్నాడు. 2004లో రిటైర్మెంట్ ప్రకటించిన కాస్పరోవ్ ఎగ్జిబిషన్, బ్లిట్జ్ ఈవెంట్లు ఆడుతున్నాడు. మరోవైపు యువ ఆటగాళ్లకు మెంటార్‌గా వ్యవహరిస్తున్న ఆనంద్ ప్రముఖ ఈవెంట్లలో అడపాదడపా పాల్గొంటున్నాడు. విజేతకు రూ. 62 లక్షలు, ఓడిన వారికి రూ. 44 లక్షల ప్రైజ్‌మనీ అందనుంది. ఒకవేళ సమమైతే చెరిసగం పంచుకుంటారు.

## ఇంగ్లండ్ కాస్త కష్టంగా



గువాహటి: మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో మాజీ చాంపియన్ ఇంగ్లండ్ జోరు కొనసాగుతోంది. మంగళవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో నెగ్గి వరుసగా రెండో విజయం అందుకుంది. అయితే పటిష్ట బ్యాటింగ్ లైనప్ కలిగిన ఇంగ్లండ్‌ను బంగ్లా బౌలర్లు కొంతమేర కట్టడి చేయగలిగారు. కానీ హీథర్ నైట్ (79 నాటౌట్) అజేయ ఆటతీరుతో జట్టు గట్టెక్కింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా 49.4 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. సోభన మోస్తరి (60), రబేయ (43), షర్మిన్ (30) రాణించారు. ఎకెల్‌స్టోన్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఇంగ్లండ్ 46.1 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులు చేసి నెగ్గింది. బ్రంట్ (32), డీన్ (27 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ఆమీ జోన్స్ (1)ను అవుట్ చేసిన పేసర్ మరూఫ షాకిచ్చింది. ఆ తర్వాత తనే మరో ఓపెనర్ బ్యూమాంట్ (13) వికెట్‌ను కూడా తీసింది. ఇక స్పిన్నర్ ఫహీమా ధాటికి మధ్య ఓవర్లలో 78/5 స్కోరుతో ఇంగ్లండ్ కష్టాల్లో పడింది. ఈ స్థితిలో హీథర్ హాఫ్ సెంచరీతో ఏడో వికెట్‌కు డీన్‌తో అజేయంగా 80 పరుగులు జోడించడంతో ఎలాంటి సంచలనం లేకుండా మ్యాచ్ ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 49.4 ఓవర్లలో 178 ఆలౌట్. (సోభన 60, రబేయ ఖాన్ 43 నాటౌట్, షర్మీన్ 30బీ ఎకెల్‌స్టోన్ 3/24, డీన్ 2/28, కాప్సీ 2/31, లిన్సే స్మిత్ 2/33).

ఇంగ్లండ్: 46.1 ఓవర్లలో 182/6. (హీథర్ 79 నాటౌట్‌బీ బ్రంట్ 32, కాప్సీ 20, డీన్ 27 నాటౌట్‌బీ ఫహీమా 3/16, మరూఫా 2/28).

## హుస్సాముద్దీన్ పసిడి పంచ్

చెన్నై: బీఎఫఐ కప్‌లో నిజామాబాద్ బాక్సర్ హుస్సాముద్దీన్ పసిడి పతకం కొల్లగొట్టి సత్తా చాటాడు. మంగళవారం జరిగిన 55-60 కిలోల ఫైనల్లో మొహమ్మద్ హుస్సాముద్దీన్ 5-0తో సాగర్ జఖర్ (సాయ్)ను చిత్తుగా ఓడించాడు. గాయం నుంచి కోలుకున్నాక తిరిగి ఫామ్‌లోకి రావడంపై హుస్సాముద్దీన్ సంతోషం వ్యక్తం చేశాడు.



## తలైవాస్ అదుర్స్



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్‌లో తమిళ్ తలైవాస్ జట్టు అదరగొట్టింది. మంగళవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 56-37తో పట్నా పైరేట్స్‌ను చిత్తుగా ఓడించింది. తలైవాస్ ఆటగాడు అర్జున్ దేశ్వాల్ రైడింగ్‌లో 21, బోనస్ ద్వారా 5 పాయింట్లు సాధించాడు. ఇక, ఉత్కంఠగా సాగిన హరియాణా స్టీలర్స్, దబాంగ్ ఢిల్లీ జట్ల పోరులో తొలుత 33-33తో స్కోరు సమమైంది. అయితే, ఫలితం కోసం నిర్వహించిన రైడింగ్‌లో దబాంగ్ 9-3తో స్టీలర్స్‌ను ఓడించింది.

## వన్డే జట్టులో స్టార్క్



మెల్‌బోర్న్: భారత్‌తో జరిగే వన్డే, టీ20ల సిరీసల కోసం ఆస్ట్రేలియా జట్లను ప్రకటించారు. గత నెల టీ20 ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన పేసర్ మిచెల్ స్టార్క్‌కు వన్డే జట్టులో చోటు దక్కింది. పని ఒత్తిడిలో భాగంగా అతడు ఆగస్టులో దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీసకు దూరంగా ఉన్నాడు. గతేడాది నవంబరులో స్టార్క్ తన చివరి వన్డే ఆడడం గమనార్హం. ఈనెల 19 నుంచి భారత్‌తో మూడు వన్డేల సిరీస్ జరుగనుంది. ప్యాట్ కమిన్స్ గాయం నుంచి కోలుకోకపోవడంతో జట్టుకు మిచెల్ మార్ష్ నాయకత్వం వహించనున్నాడు. 15 మంది ఆటగాళ్ల జాబితాలో మాథ్యూ రెన్‌షా, షార్ట్, మిచ్ ఓవెన్‌లకు కూడా చోటు దక్కింది. మరోవైపు ఈనెల 29 నుంచి జరిగే ఐదు టీ20ల సిరీస్‌లోని తొలి రెండు మ్యాచ్‌లకు మాత్రమే జట్టును ప్రకటించారు.

వన్డే జట్టు: మార్ష్ (కెప్టెన్), బార్ట్‌లెట్, క్యారీ, కనోలీ, డ్వార్షుస్, ఎల్లిస్, గ్రీన్, హాజెల్‌వుడ్, హెడ్, ఇన్‌గ్లిస, ఓవెన్, రెన్‌షా, షార్ట్, స్టార్క్, జంపా.

టీ20 జట్టు: మార్ష్ (కెప్టెన్), ఎబాట్, బార్ట్‌లెట్, డేవిడ్, డ్వార్షుస్, ఎల్లిస్, హాజెల్‌వుడ్, హెడ్, ఇన్‌గ్లిస్, కునేమన్, షార్ట్, ఓవెన్, స్టొయినిస్, జంపా.

## కోల్‌కతా బోణీ

ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్)లో కోల్‌కతా థండర్ బోల్ట్స్ శుభారంభం చేసింది. మంగళవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో కొచ్చి బ్లూ స్పైకర్స్‌తో ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా 3-1 (12-15, 15-13, 15-6, 19-17)తో నెగ్గింది. నిర్ణయాత్మక నాలుగో సెట్‌లో విజయం కోసం ఇరు జట్లూ చివరి వరకు పోరాడాయి. చివరికి సెట్‌తో పాటు మ్యాచ్‌ను కూడా కోల్‌కతా దక్కించుకుంది.



కోల్‌కతా విజయంలో కీలక పాత్ర పోషించిన పంకజ్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

## హర్మన్‌ప్రీత్ కౌర్ సంచలన రికార్డ్..

## మిథాలీ రాజ్‌ను అధిగమించిన భారత కెప్టెన్




మహిళల వన్డే వరల్డ్ కప్ 2025లో భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. లెజెండరీ బ్యాటర్ మిథాలీ రాజ్‌(ను అధిగమించి, వన్డే క్రికెట్లో భారత్ తరఫున అత్యధిక క్యాచ్‌లు పట్టిన రెండో క్రీడాకారిగా తన పేరును లిఖించుకుంది. ఈ అద్భుతమైన రికార్డుతో హర్మన్‌ప్రీత్ కేవలం తన బ్యాటింగ్ నైపుణ్యాన్ని మాత్రమే కాకుండా, ఫీల్డింగ్‌లోనూ అసాధారణ ప్రతిభను ప్రదర్శించింది.ఝులన్ గోస్వామి: 204 మ్యాచ్‌ల్లో 69 క్యాచ్‌లు (భారత్‌లో అత్యధికం)హర్మన్‌ప్రీత్ కౌర్: 154 మ్యాచ్‌ల్లో 65 క్యాచ్‌లు (రెండో స్థానం)మిథాలీ రాజ్: 232 మ్యాచ్‌ల్లో 64 క్యాచ్‌లుఈ వరల్డ్ కప్‌లో హర్మన్‌ప్రీత్ బ్యాటింగ్ విషయంలో ఫామ్ తగ్గినప్పటికీ ఆమె నాయకత్వం, ఫీల్డింగ్ నైపుణ్యం జట్టుకు కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో మిథాలీ రాజ్ రికార్డ్‌ను అధిగమించడం ద్వారా ఆమె ఆల్‌రౌండ్ సామర్థ్యాన్ని మరోసారి నిరూపించుకుంది. ఆమె క్యాచ్‌లు, రనౌట్‌లు భారత జట్టుకు ఎన్నో విజయాలను అందించాయి. ఈ రికార్డ్ ఆమె ఆటలోని అనేక అంశాల్లో స్థిరమైన సహకారాన్ని ప్రతిబింబిస్తుంది.కెప్టెన్‌గా ఆమె చూపిస్తున్న చొరవ, ఫీల్డింగ్‌లో చలాకీతనం ఆమెను భారత క్రికెట్‌లో బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిపాయి. ఈ మైలురాయి భారత మహిళల క్రికెట్ పరిణామాన్ని సూచిస్తుంది. మిథాలీ రాజ్, ఝులన్ గోస్వామి వంటి లెజెండ్‌లు స్థాపించిన వారసత్వాన్ని హర్మన్‌ప్రీత్ వంటి కొత్త తరం ఆటగాళ్లు ముందుకు తీసుకెళు_న్నారు.ఆమె రికార్డ్ కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాదు. భారత క్రికెట్ భవిష్యత్తును సూచిస్తుంది. ఈ రికార్డ్‌తో హర్మన్‌ప్రీత్ తన వ్యక్తిగత సామర్థ్యాన్ని రుజువు చేయడమే కాక, భారత మహిళల క్రికెట్ భవిష్యత్ తరానికి ఒక ఆదర్శంగా నిలుస్తుంది. ఆమె ఫీల్డింగ్ నైపుణ్యం, జట్టును ఏకతాటిపై నడిపించే సామర్థ్యం ఆమెను భారత క్రికెట్‌లో ఒక మంచి క్రికెటర్‌గా నిలబెట్టాయి.

## బీఎస్ లారాకు

## లైఫ్ టైమ్ అవార్డులు

ముంబై: ప్రతి ఏటా ప్రకటించే ప్రఖ్యాత సియట్ క్రికెట్ రేటింగ్ అవార్డుల్లో ఈసారి భారత దిగ్గజం బీఎస్ చంద్రశేఖర్, వెస్టిండీస్ గ్రేట్ బ్రియాన్ లారాలకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారాలు దక్కాయి. మంగళవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో గవాస్కర్ చేతుల మీదుగా లారా ఈ అవార్డును అందుకున్నాడు. 'టీ20 బ్యాటర్ ఆఫ్ ది ఇయర్'గా సంజూ శాంసన్, బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి అవార్డులు



గెలుచుకోగా.. ఈ ఏడాది చాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన రోహిత్ శర్మను ప్రత్యేక జ్ఞాపికతో సన్మానించారు. ఇక, ఈ ఏడాది వన్డేల్లో అత్యధిక రన్స్ చేసిన భారత క్రికెటర్‌గా నిలిచినందుకు శ్రేయాస్ అయ్యర్‌కు జ్ఞాపిక అందుకున్నాడు. 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్'గా పురుషుల్లో జో రూట్ నిలవగా, మహిళల్లో స్మృతీ మంధాన అవార్డును దక్కించుకున్నారు.

# బిజినెస్



## పసిడి పరుగు మరింత ముందుకు..

## బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (అక్టోబర్ 8న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 22, 030కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 11, 860కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 20, 080కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 12, 010కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 22, 030కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 11, 860కి చేరింది . వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయిల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం

# 82 వేలు దాటిన సెన్సెక్స్..

## ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..

వరుసగా ఐదో రోజు కూడా దేశీయ సూచీలు లాభాల బాటలో సాగుతున్నాయి. మెటల్, ఫైనాన్సియల్ రంగాల్లో కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపిస్తున్నాయి. దీంతో సెన్సెక్స్ మళ్లీ 82 వేల మార్క్ దాటేసింది. విదేశీ మదుపర్లు అమ్మకాలు కొనసాగుతున్నప్పటికీ నిఫ్టీ 25 వేల మైలురాయిని చేరుకోవడం విశేషం. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతున్నాయి. మంగళవారం ముగింపు (81, 926)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 30 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభాల్లోకి వచ్చింది. ఒక దశలో 250 పాయింట్లకు పైగా లాభపడింది. ప్రస్తుతం ఉదయం 10:15 గంటల సమయంలో సెన్సెక్స్ 129 పాయింట్ల లాభంతో 82, 055 వద్ద కొనసాగుతోంది. మళ్లీ 82 వేల మార్క్‌కు చేరుకుంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 29 పాయింట్ల లాభంతో 25, 137 వద్ద కొనసాగుతోంది %సెన్సెక్స్‌లో టైటాన్ కంపెనీ, ఎస్బీఐ కార్డ్, హిటాచీ ఎనర్జీ, నాల్కో, టీసీఎస్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . కేన్స్ టెక్నాలజీస్, ఏబీ క్యాపిటల్, కెనరా బ్యాంక్, నైకా, గ్లెన్‌మార్క్ మొదలైన షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 207 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 180 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.77గా ఉంది




## జీఆర్‌టీ జువెలర్స్ దీపావళి ఆఫర్లు



జీఆర్‌టీ జువెలర్స్.. దీపావళి పండగను పురస్కరించుకుని 'సిల్వర్ ఫర్ గోల్డ్' పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ఆఫర్‌లో భాగంగా వినియోగదారులకు బంగారు ఆభరణాల కొనుగోలుపై అందుకు సమానమైన బరువుతో వెండిని పూర్తిగా ఉచితంగా అందించనుంది. దీంతోపాటుగా బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.100 తగ్గింపును జీఆర్‌టీ అందిస్తోంది. అలాగే వజ్రాభరణాల కొనుగోలుపై ప్రతి క్యారెట్‌కు 25 గ్రాముల వెండి, అన్‌కట్ డైమండ్స్‌పై ప్రతి క్యారెట్‌కు 2 గ్రాముల వెండిని ఉచితంగా అందించనుంది. ప్లాటినం ఆభరణాలపై ఆభరణం బరువుతో సమానంగా వెండి పూర్తిగా ఉచితంగా ఆఫర్ చేస్తోంది. మరోవైపు వినియోగదారులకు వెండి వస్తువుల మేకింగ్ చార్జీలపై 25 శాతం తగ్గింపు (ప్రత్యేక వస్తువులు మినహా), వెండి ఆభరణాలు, గిఫ్ట్ ఆర్టికల్స్ వస్తువుల ఎంఆర్‌పీపై 10 శాతం తగ్గింపును అందిస్తున్నట్లు జీఆర్‌టీ జువెలర్స్ ఎండీ జీఆర్ అనంత పద్మనాభన్ తెలిపారు.

## వచ్చే ఐదేళ్లలో రూ 3 లక్షలకు బంగారం




పసిడి ధరలు ఆకాశమే హద్దుగా ఎగబాకుతున్నాయి. ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం రేటు ఇప్పటికే 50 శాతానికి పైగా పెరిగి తొలిసారిగా 4,000 డాలర్ల మైలురాయిని దాటింది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను అలుముకున్న అనిశ్చితి మబ్బులు ఇప్పట్లో తొలగేలా కన్పించడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో బులియన్ ధరలు మరింత పైకి దూసుకుపోతాయని విశ్లేషకులు అంటున్నారు. ప్రస్తుత గోల్డెన్ ర్యాలీ ఈ దశాబ్దం చివరి వరకు కొనసాగనుందని, 2030 సంవత్సరాంతానికల్లా ఔన్స్ బంగారం మరో 150 శాతం పెరిగి 10,000 డాలర్లకు చేరవచ్చని అంతర్జాతీయ మార్కెట్ నిపుణుడు ఎడ్ యార్దేని అంచనా వేశారు. ఈ లెక్కన, భారతీయ మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర వచ్చే ఐదేళ్లలో రూ.3 లక్షలు (ప్రస్తుత కరెన్సీ మారకం రేటు ప్రకారం) దాటవచ్చు.

పసిడి ర్యాలీకి యార్దేని చెబుతున్న కారణాలు

అంతర్జాతీయంగా ఆర్థిక, రాజకీయ, భౌగోళిక అనిశ్చితులు

ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు పసిడి నిల్వలను భారీగా పెంచుకుంటుండటం

బులియన్‌లో పెట్టుబడులకు వ్యక్తిగత, సంస్థాగత ఇన్వెస్టరు గతంలో కంటే అధిక ఆసక్తి కనబరుస్తుండటం

%రూ.1.24 లక్షలకు పసిడి

ఇంటర్నేషనల్ మార్కెట్‌తో పాటు దేశీయ విపణిలోనూ పసిడి ధర సరికొత్త జీవితకాల గరిష్ఠానికి చేరుకుంది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మంగళవారం మరో రూ.700 పెరిగి రూ.1,24,000కు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు సైతం రూ.700 పెరుగుదలతో ఆల్‌టైమ్ గరిష్ఠం రూ.1,23,400కు ఎగబాకింది. అమెరికా షట్‌డౌన్‌తో నెలకొన్న రాజకీయ, ఆర్థిక అనిశ్చితితో పాటు ఈ నెలలో ఫెడ్ రేట్లు మరింత తగ్గవచ్చన్న అంచనాలు గోల్డ్ రేట్లను ఎగదోస్తున్నాయి. కాగా, సిల్వర్ రికార్డు గరిష్ఠాల నుంచి కాస్త కిందికి జారింది. కిలో వెండి ఏకంగా రూ.3,400 తగ్గి రూ.1,54,000కు దిగివచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం తొలిసారిగా 4,000 డాలర్ల మైలురాయిని అధిగమించింది. వెండి మాత్రం 48 డాలర్లకు తగ్గింది.

## జోయాలుక్కాస్ ప్రచారకర్తగా సమంత



హైదరాబాద్: జువెలరీ రిటైలర్ జోయాలుక్కాస్.. తమ కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటి సమంత రూత్ ప్రభును నియమించుకుంది. సమంత ప్రచారంతో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలోని వినియోగదారులకు జోయాలుక్కాస్ మరింత చేరువ కానుందని గ్రూప్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ అన్నారు. సమంత ప్రచారం తమ మూడు దశాబ్దాల ప్రయాణాన్ని ప్రతిబింబించనుందన్నారు. ప్రతి మహిళ ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగేలా చేయటంలో జోయాలుక్కాస్ పాత్ర ఎంతో ఉందని, అలాంటి బ్రాండ్‌తో తాను పనిచేయటం ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ఈ సందర్భంగా సమంత అన్నారు.

## వచ్చే ఏడాది ౯ శాతం వేతన వృద్ధి




ముంబై: వచ్చే ఏడాది భారత్‌లో ఉద్యోగుల జీతాలు సగటున 9 శాతం పెరగవచ్చని ఏఓఎన్ నివేదిక అంచనా వేసింది. 2025లో నమోదైన 8.9 శాతం సగటు పెంపుతో పోలిస్తే వచ్చే ఏడాది మరింత మెరుగైన హైక్ లభించనుందని అంటోంది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలోనూ దేశీయంగా బలమైన వినియోగం, పెట్టుబడులు, ప్రభుత్వ సానుకూల విధానాలు ఇందుకు దోహదపడనున్నాయని నివేదిక పేర్కొంది. 45 రంగాలకు చెందిన 1,060 సంస్థల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు ఏఓఎన్ వెల్లడించింది. %ఉద్యోగుల వలసలు తగ్గుముఖం: కంపెనీల్లో ఉద్యోగుల వలసలు (అట్రిషన్) క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయని ఏఓఎన్ సర్వేలో వెల్లడైంది. 2023లో 18.7 శాతంగా ఉన్న వలసల రేటు 2024లో 17.7 శాతానికి, 2025లో 17.1 శాతానికి దిగివచ్చిందని రిపోర్టు తెలిపింది.

## హైదరాబాద్‌లో అవాంటెల్ మరో యూనిట్

శాటిలైట్ కమ్యూనికేషన్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ సంస్థ అవాంటెల్ లిమిటెడ్.. హైదరాబాద్‌లో రూ.56 కోట్లతో రెండో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించింది. రావిర్యాల, ఈ-సిటీలోని ఈ యూనిట్‌లో ఏరోస్పేస్, డిఫెన్స్ టెక్నాలజీలకు సంబంధించిన ఉత్పత్తులను ఇక్కడ అభివృద్ధి చేయనున్నట్లు తెలిపింది. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా 300 మందికి, పరోక్షంగా 1,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అవాంటెల్ వెల్లడించింది.




TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006